అంబరాన్నంటిన సంబరాలు



పుట్టపర్తిలో శ్రేణుల మధ్య సంబరాలు చేసుకుంటున్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి



ఎంపీ బీకే పార్థసారథికి స్వీటు తినిపిస్తున్న టీడీపీ నాయకులు

కూటమి అభ్యర్థుల విజయంతో శ్రేణుల్లో ఉత్సాహం

విజేతల నివాసాలు, కార్యాలయాల వద్దకు వేలాదిమంది..

పూలహారాలు, బొకేలతో అభినందనలు

సార్వత్రిక ఎన్నికల్లో కూటమి బంపర్ విజయంతో జిల్లావ్యాప్తంగా బుధవారం సంబరాలు అంబరాన్నంటాయి. ఎన్నికల్లో విజయం సాధించిన వారి ఇళ్ల వద్దకు కూటమి నేతలు, శ్రేణులు, అభిమానులు పోటెత్తారు. వేలాదిగా తరలివచ్చారు. విజేతలను గజమాలలు, పూలమాలలతో సత్కరించారు. పుష్పగుచ్ఛాలు అందజేసి, అభినందనలు తెలిపారు. కేకులు కట్ చేసి, ఆనందం పంచుకున్నారు. మిఠాయిలు పంచిపెట్టారు. దీంతో విజేతల ఇళ్ల వద్ద రోజంతా పండుగ వాతావరణం కనిపించింది.

\- పుట్టపర్తిరూరల్/పుట్టపర్తి



కదిరిలో తన నివాసం వద్ద కార్యకర్తలకు నమస్కరిస్తున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

ఐదేళ్ల కష్టాలు మరిచి..

నూతన జిల్లాలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి హిందూపురం ఎంపీతోపాటు ఆరు అసెంబ్లీ స్థానాలను కైవసం చేసుకుంది. జిల్లాలో క్లీన్‌స్వీప్ చేసింది. దీంతో కూటమి శ్రేణులు, అభిమానులు సంబరాలు చేసుకున్నారు. ఎప్పుడెప్పుడు కౌంటింగ్ జరుగుతుందా విజయం వరిస్తుందా సంబరాలు జరుపుకుందామన్నా ఆత్రుతతో ఎదురుచూసిన కూటమి వర్గాలకు బుధవారం పండుగగా మారింది. మంగళవారం మధ్యాహ్నం రెండు గంటలకే గెలుపు దాదాపు ఖరారవడంతో పార్టీవర్గాలు సంబరాలు చేసుకున్నాయి. ఎన్నడూలేని విధంగా జిల్లాలో మొదటిసారే అన్నిస్థానాలు కూటమి గెలుచుకుంది. 2019 ఎన్నికల్లో వైసీపీ ఐదుస్థానాలు గెలుచుకోగా.. ఈసారి ఒక్కటి కూడా దక్కించుకోలేకపోయింది. ఐదేళ్ల కష్టాలు ఒక్కసారిగా మరిచిపోయి కూటమి వర్గాలు సంబరాల్లో మునిగిపోయాయి.

- జిల్లాకేంద్రం పుట్టపర్తిలో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి తొలుత హనుమాన్, సత్యమ్మ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. హనుమాన్ సర్కిల్ నుంచి పార్టీ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. అక్కడ సంబరాలు చేసుకున్నారు. వేలాదిగా తరలివచ్చిన అభిమానులు.. మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి, ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డిని సత్కరించారు. బొకేలు అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు.
- కదిరిలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్.. తొలుత ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎంవీఆర్ మహల్ నుంచి తన నివాసం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. వేలాది మంది తరలివచ్చారు. ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.
- పెనుకొండలో ఎమ్మెల్యే సవిత.. బాబయ్య దర్గాను సందర్శించారు. చాదర్ సమర్పించారు. పార్టీ కార్యాలయం నుంచి ఇంటి వరకు బైక్ ర్యాలీ చేపట్టారు. వేలాదిగా అభిమానులు పాల్గొన్నారు. కేక్ కట్ చేసి, సంబరాలు నిర్వహించారు. టీడీపీ అధినేత చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. వేలాదిగా తరలివచ్చిన శ్రేణులు, అభిమానులు.. సవితను సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు.
- రొద్దం మండలం ఆర్ మరువపల్లిలో ఎంపీ బీకే పార్థసారథి నివాసానికి వేలాదిగా కూటమి శ్రేణులు, అభిమానులు తరలివచ్చారు. ఆయనకు శాలువాలు, పూలహారాలతో సత్కరించారు. పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలిపారు. కేక్‌లు కట్ చేసి, ఆనందం పంచుకున్నారు.
- ధర్మవరంలో ఎమ్మెల్యే సత్యకుమార్ నివాసం వద్దకు వేలాదిగా తరలివచ్చారు. ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. శివానగర్‌లోని శివాలయంలో సత్యకుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటలకు హైదరాబాద్ బయలుదేరి వెళ్లారు.
- మడకశిరలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు.. పార్టీ వర్గాలు, అభిమానుల మధ్య సంబరాలు చేసుకున్నారు. ఆయనను గజమాలతో సత్కరించారు.



పెనుకొండలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సవిత.. నాయకులు, కార్యకర్తలు



మడకశిరలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజును గజమాలతో సత్కరిస్తున్న నాయకులు



ధర్మవరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్

పరార్..!



ఫలితాలు వెలువడగానే కనిపించని వైసీపీ నేతలు

అధికారంలో ఉండగా అనేక అరాచకాలు

టీడీపీ విజయంతో అజ్ఞాతంలోకి..

ధర్మవరం, జూన్ 5: అధికారాన్ని అడ్డు పెట్టుకుని వైసీపీ నాయకులు పేట్రేగిపోయారు. భూకబ్జాలు, దౌర్జన్యాలు, అరాచకాలతో రెచ్చిపోయారు. వారి కన్నుపడితే భూమిని అప్పజెప్పాల్సిందే. ప్రజలను దోచుకుతిన్నారు. వారి అరాచకాలతో విసిగి వేసారిపోయిన ధర్మవరం నియోజకవర్గ ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పారు. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అఖండ విజయం సాధించింది. దీంతో నియోజకవర్గంలో అరాచకాలు సాగించిన వైసీపీ నేతల్లో వణుకు పుట్టింది. తాము సాగించిన అరాచకాలను ఎక్కడ తోడుతారోనన్న భయం పట్టుకుంది. దీంతో ఫలితాలు వెలువడిన వెంటనే కనిపించకుండా పోయారు. పారిపోయారు. పరారయ్యారు.

అధికారం అండతో అరాచకాలు

వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి 2019 ఎన్నికల్లో గెలుపొంది, సీఎం కాగానే మరో 20 ఏళ్లు తామే అధికారంలో ఉంటామంటూ చేసిన వ్యాఖ్యలు ఆ పార్టీ నేతలను రెచ్చగొట్టాయి. తమకు ఎదురేలేదన్న భావనతో ఆ పార్టీ నేతలు అరాచకాలకు తెరలేపారు. ప్రజలను దోచుకుతిన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో కూటమి ప్రభంజనం సృష్టించి, ఏకంగా 164 సీట్లు దక్కించుకుంది. వైసీపీ 11 సీట్లకే పరిమితమైంది. అధికార మార్పిడితో ద్వితీయశ్రేణి నాయకులు, ఫ్యాక్షన్ ముద్రపడిన వారి పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. ధర్మవరంలో కూటమి తరఫున పోటీచేసిన సత్యకుమార్ యాదవ్ విజయం సాధించారు. వైసీపీ తరఫున బరిలో నిలిచిన కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఓడిపోయారు. కేతిరెడ్డి అండతో నియోజకవర్గ వ్యాప్తంగా 50మందికిపైగా ఆ పార్టీ నాయకులు దౌర్జన్యాలు, భూదందాలు, బెదిరింపులు సాగించారు. వివాదాస్పద భూమి కనిపిస్తే సంబంధిత యజమానులను బెదిరించి, రిజిస్ట్రేషన్ చేయించుకుని రూ.కోట్లకు పడగలెత్తారన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ఇవన్నీ కేతిరెడ్డి కనుసన్నల్లోనే సాగించారన్నది బహిరంగ రహస్యమే. ధర్మవరం, ముదిగుబ్బ మండలానికి చెందిన కొందరు వైసీపీ నేతలు.. ప్రజలపై పడి దోచుకుతిన్నారన్న అపవాదును మూటగట్టుకున్నారు. వారిని కేతిరెడ్డి కట్టడి చేయకపోగా.. మరింత ప్రోత్సహించారన్న విమర్శలు నియోజకవర్గ వ్యాప్తంగా వ్యక్తమయ్యాయి. అధికారం మారడంతో తమకు ఇబ్బందులు తప్పవన్న భయంతో ఫలితాలు వెలువడి 24 గంటలు గడవకనే ఇల్లు, వాకిలి వదిలేసి అజ్ఞాతంలోకి వెళ్లినట్లు తెలుస్తోంది. కొందరు సాగించిన దౌర్జన్యకాండ కారణంగానే తమకు ప్రస్తుతం ఈ దుస్థితి దాపురించిందని వైసీపీలోని కొందరు నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇబ్బందులు తప్పవన్న భయంతో..

వైసీపీ హయాంలో దౌర్జన్యాలు, దాడులు, భూదందాలకు పాల్పడిన కొందరు ఆ పార్టీ నేతలు అందులో తాము ఎక్కడ ఇరుక్కుంటామోనన్న భయంతో ఊరు వదిలి పారిపోయినట్లు సమాచారం. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడి 24 గంటలు కూడా గడవకనే తప్పుచేసిన వైసీపీ నేతలు పారిపోవడం ఆశ్చర్యానికి లోనుచేస్తోంది. గొట్లూరు ప్రాంతానికి చెందిన ఓ నాయకుడు చేసిన అరాచకాలు అన్నీఇన్నీకావు. విలువైన స్థలాలు కనిపిస్తే ఎంతటివారైనా అప్పటి ఎమ్మెల్యే కేతిరెడ్డిని అడ్డుపెట్టుకుని సాగించిన దౌర్జన్యాలు, సెటిల్‌మెంట్లను నియోజకవర్గ ప్రజలు మరచిపోలేకపోతున్నారు. ఇవన్నీ మాజీ ప్రజాప్రతినిధి ఆదేశాలతో చేశారన్న విషయం ఇటీవల ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్న వీడియోల ద్వారా తెలుస్తోంది. మండలానికి చెందిన మరో ముగ్గురు ఫ్యాక్షనిస్టులతోపాటు ముదిగుబ్బ ప్రాంతానికి చెందిన మరికొందరు నాయకులు అధికారాన్ని అడ్డం పెట్టుకుని అరాచకాలు సాగించారు. ప్రతి గ్రామంలో ఇటువంటి అరాచకాలకు పాల్పడినవారు లేకపోలేదు. వాటితో విసుగుచెందే ప్రజలు ఓటు ద్వారా బుద్ధి చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో ఇక్కడ ఉండి అటు టీడీపీ, ఇటు పోలీసులతో ఇబ్బందులు పడే కన్నా కొన్నాళ్లు ఇతర ప్రాంతాలకు వెళ్లి తలదాచుకోవడమే మేలనుకుని అజ్ఞాతంలోకి వెళ్లిపోయినట్లు తెలుస్తోంది.

అంతేలేదు..

వైసీపీ అధికారంలోకి రాగానే ఆ పార్టీలోని వ్యక్తులకు అధికారం తలకెక్కినట్లయింది. వారు నిత్యం ఏదో ఒకచోట అరాచకాలు, దౌర్జన్యాలు, బెదిరింపులు సాగిస్తూ వచ్చారు. వైసీపీ అవినీతిని ప్రశ్నించారన్న నెపంతో ఏకంగా ప్రెస్‌మీట్ కోసం ప్రెస్‌క్లబ్‌లోకి వెళ్లిన ప్రతిపక్ష పార్టీకి చెందిన కొందరు నేతలపై కత్తులు, రాడ్లతో దాడిచేసి, తీవ్రంగా గాయపరిచిన విషయం తెలిసిందే. ఇలాంటి ప్రజావ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడిన వ్యక్తులను మందలించాల్సిందిపోయి వారిని వెనుకేసుకు రావడమే కాకుండా వారికి నజరానాగా కేతిరెడ్డి ప్రభుత్వ ఇంటి పట్టాలు పంపిణీ చేయడం ఇప్పటికీ నియోజకవర్గ ప్రజలు మరిచిపోలేదు. ధర్మవరం పట్టణంలోని చేనేత వర్గానికి చెందిన ఓ వ్యక్తికి బత్తలపల్లిలో భూమి ఉంది. దానిపై కన్నుపడిన కొందరు వైసీపీ నాయకులు ఆ కుటుంబాన్ని తీవ్ర ఇబ్బందులు పెట్టి, రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు సదరు వ్యక్తి ఎన్నికల సమయంలో విలేకరుల సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఆయన సార్వత్రిక ఎన్నికల్లో ధర్మవరం నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారు. ఇలాంటి భూదోపిడీలు ప్రతి మండలం, పట్టణంలో సాగించడంతో ఆ పార్టీకి అపజయాన్ని ప్రజలు అప్పగించారు.

కలెక్టర్, ఎస్పీ అభినందనలు





పుట్టపర్తి రూరల్/పుట్టపర్తి, జూన్ 5: నూతన జిల్లాలో మొదటిసారి నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగియడంపై కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి బుధవారం వేర్వేరు ప్రకటనల్లో జిల్లా ప్రజలు, అధికారులు, సిబ్బందికి అభినందనలు తెలిపారు. జిల్లాలోని రెండు కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు ప్రక్రియలో పాల్గొన్న ఆర్వోలు, ఇతర అధికారులు, సిబ్బంది, పరిశీలకులు, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల సమర్థ విధులపై అభినందనలు తెలియజేశారు. ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా సాగేందుకు సహకరించిన రాజకీయ పక్షాలు, జిల్లా ప్రజలకు కలెక్టర్, ఎస్పీ ధన్యవాదాలు తెలిపారు.

ఇలా అయ్యిందేంది.. కేతిరెడ్డీ..!



జిల్లాలో వైసీపీ హయాంలో ఎమ్మెల్యేగా ఉన్న కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేట్రేగిపోయారన్న విమర్శలు మూటగట్టుకున్నారు. గుడ్‌మార్నింగ్ పేరుతో హడావుడి చేశారు. తనకు ఎదురేలేదన్నట్లుగా వ్యవహరించారు. భూకబ్జాలు, దౌర్జన్యాలు, అరాచకాలకు కేరాఫ్‌గా నిలిచారన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. అలాంటి కేతిరెడ్డికి ధర్మవరంలోని సొంత వార్డు ప్రజలే షాకిచ్చారు. ఏకంగా కూటమి అభ్యర్థి సత్యకుమార్ యాదవ్‌కు మెజార్టీ కట్టబెట్టారు. ధర్మవరంలోని 21వ వార్డులో కేతిరెడ్డి నివాసం ఉంటున్నారు. ఆ వార్డులో కేతిరెడ్డికి 1068, సత్యకుమార్‌కు 1373 ఓట్లు వచ్చాయి. ఈ లెక్కన కూటమి అభ్యర్థికి 305 ఓట్ల మెజార్టీ దక్కింది. -ధర్మవరం

కూటమి అదుర్స్

పల్లె, పట్నంలో పట్టంకట్టిన ఓటరు

పోస్టల్ బ్యాలెట్‌లో వైసీపీ విలవిల

ఎంపీ బీకేకి క్రాస్ ఓటింగ్

పుట్టపర్తి, జూన్5(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి స్పీడ్‌కు ఫ్యాన్‌కు రెక్కలు విరిగి, కునారిల్లింది. పల్లెపట్నంలో కూటమికి ఓటర్లు పట్టం కట్టారు. జిల్లాలో హిందూపురం పార్లమెంటుతోపాటు ఏడు అసెంబ్లీ స్థానాల్లో కూటమి ఆధిక్యం ప్రదర్శించింది. హిందూపురం, పెనుకొండ, రాప్తాడు అసెంబ్లీ స్థానాల్లో టీడీపీ భారీ ఆధిక్యం సొంతం చేసుకుంది. పుట్టపర్తి, కదిరిలో మంచి మెజార్టీ సాధించింది. మడకశిరలో స్వల్ప మెజార్టీతో నెగ్గింది. టీడీపీ, జనసేనతో జత కట్టిన కమలం ధర్మవరంలో వికసించింది. జిల్లాలో హిందూపురం పార్లమెంటుతోపాటు ఏడుచోట్ల కూటమి అభ్యర్థులు గెలిచి, క్లీన్‌స్వీప్ చేశారు. వైసీపీ ఉనికేలేకుండా పోయింది. దీంతో పల్లెపట్నం తేడాలేకుండా ఓటర్లు టీడీపీ వెంట నడిచినట్లు స్పష్టమైంది. పలు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థులతో పోల్చుకుంటే ఎంపీగా గెలిచిన బీకే పార్థసారథికి మెజార్టీ దక్కింది. భారీగా క్రాస్ ఓటింగ్ జరిగిందన్న విషయం స్పష్టమవుతోంది.

కూటమి స్పీడ్‌కు నిలువలేక..

ఏడు నియోజకవర్గాల్లో హిందూపురం, కదిరి పట్టణాల్లోని కొన్ని పోలింగ్ బూత్‌లు మినహా అన్నిచోట్లా కూటమి సత్తా చాటింది. వైసీపీ ఎదురు నిలువలేకపోయింది. ధర్మవరం, మడకశిర, పెనుకొండ పుట్టపర్తి నియోజకవర్గాల్లో పల్లెపట్నంలో కూటమి పట్టు నిలుపుకుంది. వైసీపీకి పట్టున్న గ్రామాల్లో సైతం కూటమికే ఓటర్లు జైకొట్టారు. గత ఎన్నికల్లో జిల్లాలో ధర్మవరం, కదిరి, పుట్టపర్తి, మడకశిర, పెనుకొండ అసెంబ్లీ స్థానాల్లో వైసీపీ భారీ అధిక్యం సాధించింది. ఇందులో పట్టణాలు, గ్రామాల్లో అత్యధిక పోలింగ్ బూత్‌లలో వైసీపీ మెజార్టీ కైవసం చేసుకుంది. ప్రస్తుత ఎన్నికల్లో అన్నిచోట్లా ఓటర్లు కూటమి పక్షాన నిలబడ్డారు. మడరశిర, ధర్మవరంలో కూటమికి వైసీపీ గట్టిపోటీ ఇచ్చినా.. చివదాకా నిలబడలేకపోయింది.



తాడిమర్రిలో సంబరాలు చేసుకుంటున్న టీడీపీ శ్రేణులు

పోస్టల్ బ్యాలెట్ దెబ్బకు వైసీపీ విలవిల

పోస్టల్ బ్యాలెట్‌లో కూటమి అభ్యర్థుల హవా కనిపించింది. ఊహించినట్లుగానే వైసీపీ పాలనపై ఉద్యోగ, ఉపాధ్యాయులు కన్నెర్ర చేశారు. ఐదేళ్లలో అష్టకష్టాలు పడ్డారు. ప్రతిఫలంగా ఓటుతో వైసీపీని కోలుకోలేని దెబ్బతీశారు. కూటమి అభ్యర్థులకు పుట్టపర్తిలో 1568, మడకశిరలో 722, హిందూపురంలో 1472, ధర్మవరంలో 1587, కదిరిలో 2419, పెనుకొండలో 1924 ఓట్లు దక్కాయి. వైసీపీ అభ్యర్థులకు చాలా దారుణంగా ఓట్లు లభించారు. పోస్టల్ బ్యాలెట్ దెబ్బకు వైసీపీ విలవిల్లాడింది.

కమల వికాసం

ధర్మవరం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో భారతీయ జనతా పార్టీ కూడా టీడీపీ కూటమితో కలిసి వచ్చి గణనీయంగా ఓటు బ్యాంకు సాధించింది. ధర్మవరంలో వైసీపీ గట్టి పోటీ ఇచ్చినా కూటమి బీజేపీ అభ్యర్థి సత్యకుమార్‌యాదవ్ అధికార పార్టీని వెనక్కి నెట్టారు. చివరకు సత్యకుమార్‌యాదవ్ 3734 ఓట్లతో విజయం సాధించారు. ఇక్కడ టీడీపీ, జనసేన ఓట్లు బీజేపీకి వేయడంతో ధర్మవరంలో కమలం వికసించింది.

అతివిశ్వాసమే దెబ్బతీసిందా?

2019 సార్వత్రిక ఎన్నికల్లో హిందూపురం అసెంబ్లీ మినహా పార్లమెంటుతోపాటు ఆరుచోట్ల వైసీపీ గెలిచింది. అంతకు మునుపు 2014 ఎన్నికల్లో కదిరిలో వైసీపీ విజయం సాధించింది. ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో కూటమికి వైసీపీ పోటీ ఇవ్వలేకపోయింది. అధికార వైసీపీలో ధర్మవరం, రాప్తాడు, పుట్టపర్తి, కళ్యాణదుర్గం సిట్టింగ్ ఎమ్మెల్యేతోపాటు మూడు చోట్ల కొత్త ముఖాలు పోటీ ఇవ్వలేక చతికిలపడ్డారు. అతి విశ్వాసమే కొంపముంచిందా, పార్టీ ఓట్లను కూడా వేయించుకోవడంలో విఫలమైనట్లు వైసీపీలో ఆందోళన చెందుతున్నారు. ధర్మవరం, మడకశిరలో స్వల్ప మెజార్టీతో కూటమి అభ్యర్థులు గెలుపొందడాన్ని వైసీపీ జీర్ణించుకోలేకపోతోంది. ఓటమికి కారణాలను ఆ పార్టీ విశ్లేషించుకుంటోంది. సంక్షేమ పథకాలు పెద్దఎత్తున ఇచ్చినా పల్లెపట్నంలో ఓట్లు రాకపోవడం ఏంటని వైసీపీ నేతలు అయోమయంలో పడ్డారు. పైగా ఎన్నికల్లో వైసీపీ భారీగా ఓటర్లకు ప్రలోభాలు పెట్టినా, ఉచితాలు పంపిణీ చేసినా ఓటర్లు మాత్రం కూటమి వైపే ఏకపక్షంగా మొగ్గుచూపారు. ప్రలోభాలు పనిచేయలేదని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఈ ఫలితాలతో వైసీపీలో నైరాశ్యం, నిస్పృహ ఆవరించింది.

‘ఎవరు గెలిచినా మీదే గెలుపు’

లక్కీడ్రాలో విజేతల ఎంపిక



ఆంధ్రజ్యోతి అనంతపురం యూనిట్ కార్యాలయంలో విజేతల ఎంపిక

అనంతపురం కల్చరల్, జూన్ 5: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎవరు గెలిచినా మీదే గెలుపునకు సంబంధించి బుధవారం ఆంధ్రజ్యోతి జిల్లా కార్యాలయంలో లక్కీడ్రా నిర్వహించారు. నలుగురు విజేతలను ఎంపిక చేశారు. జిల్లావ్యాప్తంగా 5వేల మంది కూపన్లలో వివరాలు నమోదు చేసి ఆంధ్రజ్యోతి కార్యాలయానికి పంపారు. 14 నియోజక వర్గాలకు 14 ఎన్డీఏ కూటమి విజయం సాధిస్తుందని 151 మంది నమోదు చేశారు. మొదటిస్థానంలో ఒకరిని, ద్వితీయ స్థానంలో ముగ్గురిని విజేతలుగా లక్కీడ్రాలో ఎంపిక చేశారు. మొదటిస్థానంలో నిలిచిన విజేతకు రూ.10వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన విజేతలకు ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున నగదు బహుమతులు అందజేయనున్నారు. కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి అనంతపురం బ్రాంచ్ మేనేజర్ జీ గోపాల్‌నాయుడు, బ్యూరో ఇన్‌చార్జి వెలుగు రామకృష్ణుడు, ఏబీఎన్ స్టాఫర్ సురేష్‌బాబు, డిప్యూటీ మేనేజర్ మారుతీ ప్రసాద్, ఏసీఎం నారాయణస్వామి నాయక్, అసిస్టెంట్ మేనేజర్ రమేష్‌బాబు, టెక్నికల్ ఇన్‌చార్జి నవీన్ పాల్గొన్నారు.

విజేతల వివరాలు

మొదటి బహుమతి

నరావుల రామప్ప, డోనెం.12/1/369, అశోక్‌నగర్, అనంతపురం

ముగ్గురికి ద్వితీయ బహుమతి

ఎం. నాగేంద్రరావు, డోనెం.20/34-సి3, హనుమేష్ నగర్, గుంతకల్లు, అనంతపురం జిల్లా.

ఎం.క్రిష్ణవేణి, భర్త : నాగలింగేశ్వర్, బూర్నకుంట, పెద్దవడుగూరు (మం), అనంతపురం జిల్లా.

షేక్ మజీద్ సాబ్, డోనెం. 17-6-234, న్యూ హస్నాబాద్, హిందూపురం (మం), శ్రీసత్యసాయి జిల్లా

అరాచక ప్రభుత్వాన్ని తరిమికొట్టారు

టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్



మీడియాతో మాట్లాడుతున్న వెంకటశివుడు యాదవ్

అనంతపురం అర్బన్, జూన్ 5: అవినీతి, అరాచక ప్రభుత్వాన్ని ప్రజలు తరిమికొట్టారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ అన్నారు. బుధవారం స్థానిక రామ్‌నగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో సత్యసాయి జిల్లా టీడీపీ అధ్యక్షుడు వడ్డే అంజినప్పతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్డీయూ కూటమి అభ్యర్థులను భారీ మెజార్టీతో ప్రజలు గెలిపించారన్నారు. దేశంలోనే బలమైన పార్టీగా టీడీపీ అవతరించిందన్నారు. జగన్, వైసీపీ నేతల అహంకారం, సైకో విధానాలను భరించలేక అన్ని వర్గాల ప్రజలు వైసీపీని కూకటివేళ్లతో పెలికించారన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, పార్టీ రథసారధి నారాలోకేశ్‌పై నమ్మకంతో ప్రజలు ఈ తీర్పునిచ్చి ఏపీలో స్వర్ణయుగానికి బీజం వేశారన్నారు. ఉమ్మడి అనంత జిల్లాలో అన్ని అసెంబ్లీ స్థానాలు, రెండు ఎంపీ స్థానాల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధించేందుకు కృషి చేసిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి అనంత జిల్లాను అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలుపుతామన్నారు. కార్యక్రమంలో నాయకులు దేవళ్ల మురళీ, సుధాకర్ యాదవ్, కురుబ నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.



హాజరైన పోలీసులు, మాట్లాడుతున్న ఎస్పీ



అందరికీ థ్యాంక్స్

ఎస్పీ గౌతమిశాలి

అనంతపురం క్రైం, జూన్ 5: ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా ముగిసేందుకు భద్రతా చర్యలు చేపట్టిన ప్రతి ఒక్కరికీ జిల్లా ఎస్పీ గౌతమిశాలి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో మంగళవారం కౌంటింగ్ బందోబస్తు విధుల్లో పాల్గొన్న పోలీసు సిబ్బంది, కేంద్ర, రాష్ట్ర బలగాలతో బుధవారం జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలో ఎస్పీ సమావేశమయ్యారు. అందరూ సమష్టిగా కష్టపడటం వల్లే కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందన్నారు. ఎన్నికల్లో ఆఖరు, కీలకఘట్టమైన కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగియడం శుభపరిణామమన్నారు. ఇదే స్ఫూర్తితోనే మరికొన్ని రోజులు శ్రమించి జిల్లాను ప్రశాంతంగా ఉంచుదామని పిలుపునిచ్చారు. సమావేశంలో పలువురు డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది కేంద్ర, రాష్ట్ర బలగాల పోలీసులు పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో వర్షం

అనంతపురం అర్బన్, జూన్ 5: జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. అనంతపురం, ఉరవకొండ, బెళుగుప్ప, బొమ్మనహాల్ మండలాల్లో ఓ మోస్తారు వర్షం పడింది. కూడేరు, పామిడి, పుట్లూరు తదితర మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి.

అదనపు విత్తన వేరుశనగ కోసం ప్రతిపాదనలు

అనంతపురం అర్బన్, జూన్ 5: జిల్లాకు 12,500 క్వింటాళ్ల విత్తన వేరుశనగ కోసం జిల్లా వ్యవసాయ యంత్రాంగం రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనరేట్‌కు ప్రతిపాదనలు పంపారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో జిల్లాకు 76 వేల క్వింటాళ్ల వేరుశనగ కేటాయించారు. ఇప్పటి దాకా జిల్లా వ్యాప్తంగా 67 వేల క్వింటాళ్ల కోసం రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వీరిలో ఇప్పటి వరకు 56 వేల మంది రైతులకు విత్తన వేరుశనగ పంపిణీ చేశారు. జిల్లాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పలు మండలాల్లో విత్తన వేరుశనగ కోసం డిమాండ్ పెరిగింది. దీన్ని దృష్టిలో ఉంచుకొని జిల్లాకు అదనంగా మరో 12,500 క్వింటాళ్ల విత్తన వేరుశనగ కేటాయించాలని ప్రతిపాదనలు పంపారు.

ఇంక ఊపిరి పీల్చుకోవచ్చు

జేఎన్‌టీయూ నుంచి ఎన్నికల సామగ్రి తరలింపు

10 నుంచి తరగతుల ప్రారంభం

వర్సిటీ సిబ్బందికి తప్పిన భద్రత బెడద

అనంతపురం సెంట్రల్, జూన్ 5: సార్వత్రిక ఎన్నికల ఘట్టం ముగియడంతో జేఎన్‌టీయూ వర్గాలు ఊపిరి పీల్చుకున్నాయి. మే నెల ఆరంభం నుంచే ఎన్నికల నిర్వహణాధికారులు జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలోని కొన్ని భవనాలను స్వాధీనం చేసుకున్నారు. కళాశాల ప్రధాన భవనం, ఎన్‌టీఆర్ ఆడిటోరియం, ఈసీఈ బిల్డింగ్, వర్సిటీ పాత పరిపాలనా భవనాల్లో ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. కౌంటింగ్‌కు రెండు వారాల ముందు నుంచి కట్టుదిట్టమైన భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేశారు. జేఎన్‌టీయూ అధికారులు, సిబ్బందిని సైతం ఐడీ కార్డులుంటేనే లోపలికి అనుమతించారు. ఈ క్రమంలో భద్రత మధ్యనే వారు విధులు నిర్వహించారు. కౌంటింగ్‌కు ముందు వర్సిటీ పరిసరాలను రెడ్‌జోన్‌గా ప్రకటించి మరింత నిఘాపెంచారు. మంగళవారం కౌటింగ్ ముగియడంతో బుధవారం జేఎన్‌టీయూ నుంచి ఎన్నికల సామగ్రిని తరలించడం ప్రారంభించారు. రెవెన్యూ, విద్యాశాఖ, నగరపాలక సంస్థ సిబ్బంది తరలింపులో నిమగ్నమయ్యారు. వర్సిటీ పరిసరాలను కార్మికులతో శుభ్రం చేయించారు.

10 నుంచి తరగతులు

ఎన్నికలను పురస్కరించుకుని జేఎన్‌టీయూ విద్యార్థులకు సెలవులు ప్రకటించారు. కౌంటింగ్ ముగియ డంతో 10నుంచి యథావిధిగా తరగతులు ప్రారంభించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ తెలిపారు. 17నుంచి బీటెక్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ద్వితీయ, తృతీయ, నాలుగో సంవత్సరం తరగతుల విద్యార్థులకు వివిధ సమయాల్లో తరగతులు ప్రారంభమయ్యాయి. దీంతో ఓవైపు పరీక్షలు, మరోవైపు తరగతులు ఇలా గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ వ్యత్యాసాలను సరిదిద్ది మూడు సంవత్సరాల విద్యార్థులకు ఒకేసారి తరగతులు, పరీక్షలు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించినట్లు వర్సిటీ అధికారులు వెల్లడించారు.




ఇనుప బారికేడ్లను లోడ్ చేస్తున్న కార్మికులు



కంటైనర్‌లో ఈవీఎంలు

తండ్రిని మించిన ఆధిక్యం

రికార్డు మెజార్టీ సాధించిన జేసీ అశ్మిత్‌రెడ్డి



తాడిపత్రిటౌన్, జూన్ 6: తాడిపత్రి అసెంబ్లీ నియోజకవర్గంలో టీడీపీ విజయంతో మెజార్టీలో తండ్రిని మించిన తనయుడిగా జేసీ అశ్మిత్‌రెడ్డిని కొనియాడుతున్నారు. రాష్ట్రంలోనే ఓ ప్రత్యేకత సంతరించుకున్న నియోజకవర్గ ఫలితంపై రాష్ట్ర ప్ర జలు ఎంతో ఆసక్తి కనబరిచారు. ఎందుకంటే మూ డేళ్ల కిందట జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో రాష్ట్రమం తా ఫ్యాన్ హవా చూపినా తాడిపత్రిలో మాత్రం సైకిల్ జోరు చూపించింది. దీంతో ఈ సెగ్మెంట్‌పై అందరి చూపు పడింది. అందరూ అనుకున్న విధంగానే టీడీపీ జోరు చూపించి జేసీ అశ్మిత్‌రెడ్డి ఘనవిజయం సాధించాడు. దీనివెనుక జేసీ ప్రభాకర్‌రెడ్డి, జేసీ అశ్మిత్‌రెడ్డిలు పడిన కష్టం అంతాఇంతా కాదు. వైసీపీ ప్రభుత్వం పెట్టిన ఎన్నో ఇబ్బందుల ను అధిగమిస్తూ నిత్యం ప్రజల్లోనే ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.

జేసీ ఫ్యామిలీకి కంచుకోట

40ఏళ్లగా జేసీ ఫ్యామిలీకి తాడిపత్రి కంచుకోటగా ఉంది. ఈ ఫ్యామిలీ నుంచి జేసీ దివాకర్‌రెడ్డి ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందాడు. జేసీ ప్రభాకర్‌రెడ్డి ఒకసారి ఎమ్మెల్యేగా గెలుపొందాడు. కానీ వీరికి రికార్డు మెజార్టీ ఎప్పుడూ రాలేదు. ఆ లోటును జేసీ అశ్మిత్‌రెడ్డి తీర్చాడు. 1951లో ఏర్పడిన తాడిపత్రి నియోజకవర్గంలో ఇంత వరకు ఎన్నడూ రాని రీతిలో జేసీ అశ్మిత్‌రెడ్డి 29068ఓట్ల మెజార్టీ సాధించాడు. తాడిపత్రి నియోజకవర్గంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా జేసీ సోదరులు గెలిచేవారు. కానీ 2019లో జరిగిన ఎన్నికల్లో ఫ్యాన్ హ వాలో మొదటిసారి టీడీపీ తరపున పోటీచేసిన జేసీ అశ్మిత్‌రెడ్డి ఓటమిపాలయ్యారు. కానీ ఆయన ఏమాత్రం నిరాశపడలేదు. ఎక్కడ ఏ పొరపాటు జరిగిందో విశ్లేషించుకున్నారు, చిన్నచిన్న లోపాలను సరిదిద్దుకొని ఉవ్వెత్తున కెరటంలా లేచి నిలబడి ప్ర స్తుత ఎన్నికల్లో విజయం సాధించాడు. దీంతో జేసీ ఫ్యామిలీ మొత్తం సంబరాల్లో మునిగిపోయింది.

నెరవేరిన జేసీపీఆర్ కల

తాడిపత్రిలో మున్సిపల్ చైర్మన్‌గా జేసీ ప్రభాకర్‌రెడ్డి ఉంటున్నారు. తన కుమారుడు జేసీ అశ్మిత్‌రెడ్డిని ఎమ్మెల్యేగా చూడాలన్నది ఆయన కల. అది ప్రస్తుత ఎన్నికల్లో నెరవేరడంతో ఆయన ఆనందానికి హద్దులు లేకుండా పోయాయి. తాను మున్సిపల్ చైర్మన్ కాగా తన కుమారుడు ఎమ్మెల్యే అని అందరికి చెప్పుకుంటూ మురిసిపోతున్నాడు. అభివృద్ధిలో తండ్రిని మించి చేయాలని జేసీ అశ్మిత్‌రెడ్డి కసిగా ఉన్నట్లు తెలుస్తోంది. ముందుగా తాడిపత్రిలో అస్తవ్యస్తంగా ఉన్న అండర్ డ్రైనేజీ సమస్యను గాడిలో పెట్టేందుకు ప్రణాళికను సిద్ధం చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించినట్లు సమాచారం. తాడిపత్రికి రాకముందే ఇప్పటికే ఒక్కొక్క సమస్యను పరిష్కరించేందుకు ఆయన కసరత్తు ప్రారంభించినట్లు తెలిసింది.

బదిలీల పేరుతో రూ.లక్షలు వసూలు

సర్దుబాటంటూ బుకాయింపు

కోడ్ ఉల్లంఘనే అంటున్న ఉద్యోగులు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 5: బదిలీల పేరుతో వసూళ్లకు పాల్పడుతున్నారు. ఒక్కో ఉద్యోగి నుంచి రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు వసూలుకు శ్రీకారం చుట్టారు. ఓ వైపు సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ యథేచ్ఛగా ఏపీఎంలను బదిలీ చేయడంపై సర్వత్రా ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. దేశవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులో ఉంది. కోడ్ ఉల్లంఘిస్తూ డీఆర్‌డీఏ-వైకేపీలో సుమారు 13మంది ఉద్యోగులను బదిలీలు చేయడం గమనార్హం. పరిపాలనా సౌలభ్యం కోసం సర్దుబాటు చేశామంటూ బుకాయిస్తున్నారు. విడపనకల్లు, బెళుగుప్ప మండలాల ఏపీఎంలకు ప్రమాదం జరగడంతో ఇదే అదనుగా అనుకూలంగా ఉన్న పెద్దవడుగూరు, ఉరవకొండ ఏపీఎంలను ఇక్కడికి బదిలీ చేశారు. ఇలా సుమారు 13మందిని ఉద్యోగులను బదిలీ చేస్తూ కోడ్ ఉల్లంఘించారు. ఈ బదిలీలకు సంబంధించి ఒక్కో ఉద్యోగి నుంచి రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేసినట్లు సమాచారం. అంతేకాకుండా కొత్త ప్రభుత్వం ఏర్పాటు కానుండడంతో తమ అనుయాయులైన ఉద్యోగులను నచ్చిన ప్రాంతాలకు బదిలీ చేయడానికి ఓ అర్జీతో పాటు ముడుపులు పుచ్చుకుంటున్నట్లు ఆ శాఖలో చర్చించుకుంటున్నారు.

వసూళ్ల బాధ్యత ఆ ఇద్దరికే..

ఉద్యోగుల బదిలీలకు అడ్వాన్సుగా వసూలు చేసి మిగిలిన ముడుపులు వసూలు చేసే బాధ్యతను ఇద్దరు ఉద్యోగులకు అప్పగించినట్లు తెలుస్తోంది. ఇందులో ద్వితీయ శ్రేణి అధికారి, తృతీయ శ్రేణి ఉద్యోగి ఉన్నట్లు సమాచారం. ఉద్యోగుల వినతితో పాటు అమ్యామ్యాలు తీసుకోవాలని ఇప్పటికే హుకుం జారీ చేశారు. ఇక వాహన సదుపాయం కోసం ఓ ఏరియా కోఆర్డినేటర్ (ఏసీ)గా రెగ్యులర్ ఉంటూ. మరో సబ్జెక్టుకు డీపీఎంగా వ్యవహరిస్తున్నారు. సీనియర్ డీపీఎంలు ఉన్నప్పటికీ ఏసీకి అదనంగా ప్రాజెక్టులో ఓ యాంకర్ పర్సన్‌గా నియమించడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పైగా ఆ ఏసీ క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లిన ప్రతిసారీ కింది స్థాయి ఉద్యోగులతో నిత్యావసర సరుకులు, కూరగాయలు, ఇతర సరుకులు తెచ్చుకుంటున్నట్లు తోటి ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. ఈ అధికారికి పెద్ద ఎత్తున వంతపాడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఎన్నికల కోడ్ అమలులో ఉండగా బదిలీలు

సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులో ఉండగా బదిలీలు చేయడం దుమారం రేపుతోంది. విషయాన్ని బయటకు పొక్కకుండా ముడుపులు పుచ్చుకుని బదిలీలు చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా ఎన్నికల కమిషనర్ అనుమతి లేకుండా ఎటువంటి బదిలీలు చేపట్టరాదు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తూ తమకు నచ్చిన వారికి బదిలీలు చేయడం తీవ్రచర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే బదిలీల కోసం వినతులు, ముడుపులు పుచ్చుకుని వ్యవహారం నడుపుతున్నట్లు సమాచారం. ఎన్నికల కోడ్ ముగిసి కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యేలోపు బదిలీలకు రూ.లక్షల్లో వసూలు చేసి జేబులునింపుకునే పనిలో డీఆర్‌డీఏ-వైకేపీ అధికారులు నిమగ్నమయ్యారు.

సర్దుబాటు చేశామంతే

ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఉద్యోగుల సౌకర్యార్థం కొందరికి సర్దుబాటు చేశాం. విడపనకల్లు, బెళుగుప్ప ఏపీఎంలకు ప్రమాదం జరగడంతో సమీపంలోని ఏపీఎంలకు ఇంచార్జి బాధ్యతలు అప్పగించాం. ఇందులో ఎటువంటి ఉద్దేశ్యం లేదు. ప్రధానంగా ఉద్యోగుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుంటాం. జిల్లా అధికారులు, సెర్ప్ అధికారుల అనుమతితోనే ఏపీఎంల సర్దుబాటు చేశాం. పరిపాలనలో భాగంగానే ఏపీఎంలను బదిలీ చేశాం. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున బదిలీలు చేపట్టరాదు.


- నరసింహారెడ్డి, డీఆర్‌డీఏ-వైకేపీ పీడీ

పోల్ పోస్టుమార్టం

బూత్‌లవారీగా పరిశీలించే పనిలో అభ్యర్థులు

కిందిస్థాయి నాయకుల పనితీరుపై బేరీజు

పార్టీ వ్యతిరేకులను గుర్తించేందుకు యత్నం



హిందూపురం, జూన్ 5: సార్వత్రిక ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు పోల్ పోస్టుమార్టం చేస్తున్నారు. పోలైన ఓట్ల జాబితా ఆధారంగా ఏ బూత్‌లో ఎన్ని ఓట్లు అనుకూలంగా పడ్డాయి. ఎన్ని వ్యతిరేకంగా వేశారన్న లెక్కలు వేసే పనిలో అభ్యర్థులు నిమగ్నమయ్యారు. ఎన్నికల బరిలో నిలిచి అపజయం పాలైన ప్రధాన పార్టీల అభ్యర్థులు ఈ కసరత్తు ప్రారంభించారు. తమ అపజయానికి ఏ బూత్, ఏ వార్డు, పంచాయతీలు కారణమోనని గుర్తించే ప్రయత్నం చేస్తున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో ఏడు అసెంబ్లీ, ఒక పార్లమెంటు నియోజకవర్గానికి ఎన్నికలు నిర్వహించారు. కూటమి అభ్యర్థులు క్లీన్‌స్వీప్ చేశారు. వైసీపీ బోణీ కూడా కొట్టలేక బోల్తాపడింది. ఆ పార్టీ అభ్యర్థులు విజయం సాధించాలని కోట్లాది రూపాయలు ఖర్చు చేసినప్పటికీ ఫలితం లేకపోవడంతో అపజయానికి వాస్తవాలు వెలుగులోకి తెచ్చే పనిలో పడ్డారు. ఎన్నికలు పురస్కరించుకుని ప్రధాన పార్టీల అభ్యర్థులు వారి నియోజకవర్గంలో బూత్‌లవారీగా ఇన్‌చార్జిలను ఏర్పాటు చేసుకుని, ప్రచారం సాగించారు. రెండు నెలలపాటు ఇన్‌చార్జిలకు అన్ని రకాల సౌకర్యాలు సమకూర్చి, ఇంటింటి ప్రచారం చేయడం జరిగింది. అంతేకాక నియోజకవర్గంలో అధికారంలోకి వచ్చిన పార్టీ అభ్యర్థి ఐదేళ్లలో కార్యకర్తలు, నాయకులను కాపాడుకునేందుకు ఏకంగా రూ.10కోట్లు ఖర్చు చేసినట్లు సమాచారం. ఎందుకంటే ఆ నియోజకవర్గంలో క్లస్టర్ ఇన్‌చార్జి, బూత్ కన్వీనర్లను ఏర్పాటు చేసుకున్నారు. వారికి ఏడాదిగా నెలనెలా వేతనం ఇస్తూ పార్టీ కార్యక్రమాలు చురుగ్గా చేయించారు. వీరుకాకుండా ప్రధాన పార్టీలకు కొన్ని సర్వే బృందాలు ఆరు నెలలుగా లక్షలాది రూపాయలు తీసుకుంటూ పనిచేశాయి. ఇంతా చేసినా కొన్ని వార్డుల్లో ప్రధాన పార్టీలకు ఎదురుగాలి తప్పలేదు. దీంతో ఇన్ని రకాలు ఖర్చుచేసినా ఓట్లు రాకపోవడం ఏంటని గుర్తించే పనిలో అభ్యర్థులు తలమునకలవుతున్నారు. పెద్దఎత్తున ఖర్చు చేసినప్పటికీ అనుకూలంగా ఫలితాలు రాకపోవడంతో పోల్ పోస్టుమార్టం చేసుకుని తమకు పోలైన ఓట్లు వ్యతిరేకంగా లెక్కలు చూస్తున్నారు. ఇన్‌చార్జిలలో ఎవరు, ఏమేరకు పనిచేశారో పోలైన ఓట్ల ఆధారంగా తేలే అవకాశం ఉంటుంది.

కొందరిలో ఆందోళన

అభ్యర్థులు ఈ కసరత్తు ప్రారంభించినట్లు తెలుసుకుని బూత్, క్లస్టర్ ఇన్‌చార్జిలతోపాటు మండల కన్వీనర్లలో కూడా ఆందోళన మొదలైంది. వారికి కేటాయించిన బూత్‌లలో తక్కువ ఓట్లు ఉన్నట్లు గుర్తిస్తే తాము పెద్ద అపవాదు మోయాల్సి వస్తుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ కసరత్తుతో పోలింగ్ బూత్ ఇన్‌చార్జిలు పనితనం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంటుంది. తాము నియమించిన ఇన్‌చార్జిలు ఏ మేరకు ప్రచారం చేశారనేది స్పష్టం అవుతుంది. అభ్యర్థి సమకూర్చిన అన్ని రకాల సౌకర్యాలు పొంది కొన్నిచోట్ల ప్రత్యర్థికి పని చేశారా అన్న వాస్తవం ఈ పోల్ పోస్టుమార్టంలో బహిర్గతమయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఇన్నిరకాల వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉండటంతో కిందిస్థాయి ఇన్‌చార్జిలు, క్లస్టర్ బాధ్యులు ఆందోళన చెందుతున్నారు. బూత్‌ల ఇన్‌చార్జిలతోపాటు వాటి పరిధిలో ఉన్న కిందిస్థాయి నాయకులు సైతం అపజయం పాలైన అభ్యర్థిని కలిసేందుకు ముఖం చాటేస్తున్నట్లు సమాచారం. ఆయా రాజకీయ పార్టీల నుంచి బరిలో నిలిచిన అభ్యర్థులు ఎన్నికల ప్రచారంకంటే ఎక్కువగా ప్రత్యర్థి అనుచరులను కొనుగోలు చేయడంపై కొన్ని నియోజకవర్గాల్లో దృష్టిపెట్టారు. తమ చుట్టూ ఉన్నవారంతా మేలుకోరేవారనే అభద్రతతో ఉన్నారంటే కొనుగోళ్లు ఏమేరకు సాగాయో అర్థం చేసుకోవచ్చు. ఓటుకు రూ.వెయ్యి నుంచి రూ.3వేల దాకా పంచినా ఓడిపోవడంపై ప్రత్యేక దృష్టిపెట్టినట్లు తెలుస్తుంది. మొత్తంగా పోల్ పోస్టుమార్టంతో కిందిస్థాయి నేతలు, పార్టీ శ్రేణులు.. వారి పార్టీ అభ్యర్థుల కోసం ఏమేరకు పనిచేశారో తేటతెల్లమయ్యే అవకాశం స్పష్టంగా ఉంది. దీంతో పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన వారి జాతకాలు బయటపడనున్నాయి.

క్రాస్ చేశారు..!

బీకే పార్థసారథికి 1,32,427 ఓట్ల మెజార్టీ



పుట్టపర్తి, జూన్5 (ఆంధ్రజ్యోతి): హిందూపురం పార్లమెంటు స్థానానికి కూటమి తరఫున పోటీ చేసిన బీకే పార్థసారధి 1,32,427 ఓట్ల మెజార్టీ సాధించారు. హిందూపురం పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోస్టల్ బ్యాలెట్ కలుపుకుని 7,25,534 ఓట్లు కైవసం చేసుకున్నారు. వైసీపీ అభ్యర్థి శాంతకు 5,93,107 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థి సమద్ షాహీన్‌కు 55,059 ఓట్లు దక్కాయి. స్వతంత్ర అభ్యర్థుల్లో ప్రతాప్‌రెడ్డికి 5444, నోటాకు 17,971 ఓట్లు పడ్డాయి. పోస్టల్ బ్యాలెట్‌లో కూటమి అభ్యర్థి బీకే పార్థసారథికి 12,521, శాంతకు 5,701, కాంగ్రెస్ అభ్యర్థికి 1,070 ఓట్లు దక్కాయి. కాంగ్రెస్‌కు మడకశిరలో 15,469, హిందూపురంలో 13,018, కదిరిలో 8,319 ఓట్లు లభించడం విశేషం. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థి బీకే పార్థసారథికి, ఎమ్మెల్యే అభ్యర్థులకు వచ్చిన ఓట్లలో తేడా కనిపించింది. ధర్మవరం, మడకశిరలో ఎమ్మెల్యే అభ్యర్థుల కంటే అధిక మెజార్టీ వచ్చింది.

ఎన్ఎంఎంఎస్‌కు

209 మంది ఎంపిక

అనంతపురం విద్య, జూన్ 5: జాతీయ ఉపకార వేతనాలు పొందేందుకు అనంతపురం జిల్లా నుంచి 209 మంది విద్యార్థులు ఎంపికైనట్లు డీఈఓ వరలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ఏడాది డిసెంబరు మూడో తేదీన నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ వెబ్‌సైట్ www.bse.ap.gov.inలో ఫలితాల వివరాలు ఉన్నాయన్నారు. జిల్లా నుంచి ఎంపికైన 209 మంది విద్యార్థులు తమ మెరిట్ కార్డులు త్వరలో సంబంధిత స్కూళ్లకు పంపుతారన్నారు. ఆ విద్యార్థులు ఏదైనా జాతీయ బ్యాంకులో విద్యార్థి పేరున సేవింగ్స్ ఖాతా ఓపెన్ చేయించుకుని, తండ్రి లేదా తల్లిని జాయింట్ చేసుకుని విద్యార్థి ఆధార్ నెంబర్‌కు అకౌంట్‌కు లింక్ చేయించుకోవాలన్నారు. జాతీయ విద్యా మంత్రిత్వ శాఖ త్వరలోనే నేషనల్ స్కాలర్ షిప్‌పోర్టల్‌ను ప్రారంభిస్తుందన్నారు. పోర్టల్ ఆరంభమైన వెంటనే ఎంపికైన విద్యార్థులు తమ వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు.

చీనీకాయలు టన్ను రూ.40 వేలు

అనంతపురంరూరల్, జూన్ 5: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.40 వేలు, కనిష్ఠంగా రూ.16 వేలు, సరాసరి రూ.25 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 408 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

టీడీపీ వర్గీయులపై కేసు నమోదు

యాడికి, జూన్ 5: మండలంలోని రాయలచెరువులో టపాసులు కాల్చి ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని టీడీపీ వర్గీయులు 35 మందిపై కేసు నమోదుచేసినట్లు సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు. మంగళవారం ఎన్నికల ఫలితాల వెల్లడి తర్వాత టీడీపీ వర్గీయులు జాతీయ రహదారిపైకి వచ్చి టపాసులు కాల్చారని తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉందని, 6వ తేదీ వరకు టపాసులు కాల్చడం నిషేధించినట్లు తెలిపారు. నిబంధనలను టీడీపీ నాయకులు ఉల్లంఘించారని తెలిపారు. దీనిపై స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ దామోదర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదుమేరకు 35 మందిపై కేసు నమోదుచేశామని సీఐ తెలిపారు.

పోలీసుల అదుపులో

హత్యకేసు నిందితులు?

ధర్మవరం, జూన్ 5

ఎన్ఎస్‌యూఐ జాతీయ కార్యదర్శి సంపత్‌కుమార్ హత్యకేసులో నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. హిందూపురానికి చెందిన సంపత్‌కుమార్‌ను మే 30వ తేదీన గుర్తుతెలియని వ్యక్తులు హత్యచేసి, శవాన్ని ధర్మవరం చెరువు సమీపంలో కంపచెట్లలో పడేసిన విషయం తెలిసిందే. ఈ హత్యకేసును పోలీసు ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం, పోలీసు సిబ్బంది నిందితులకోసం ముమ్మర గాలింపు చేపట్టారు. బుధవారం సాయంత్రం ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలుస్తోంది. ఎవరు, ఎందుకు హత్య చేయించారనే కోణంలో విచారణ చేపట్టారు. దర్యాప్తు కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది. త్వరలోనే వివరాలు వెల్లడించే అవకాశాలున్నాయి.

ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ రాజీనామా

అనంతపురం కల్చరల్, జూన్ 5: ఏపీఎస్ ఆర్టీసీ కడప జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల రాజీనామా చేశారు. మాల్యవంతం మంజుల తన భర్త ఓబులేసుతో కలిసి బుధవారం తన కార్యాలయంలో సమావేశం నిర్వహించి, ఆర్టీసీ యాజమాన్యానికి తన రాజీనామా లేఖను పంపినట్లు వెల్లడించారు.

కందికుంటకు జన నీరాజనం

● ఘనంగా విజయోత్సవ ర్యాలీ


ఖాద్రీశుడి ఆలయంలో కందికుంటకు తీర్థప్రసాదాలు అందజేస్తున్న అర్చకులు

కదిరి, జూన్ 5: కదిరి ఎమ్మెల్యేగా కందికుంట వెంకటప్రసాద్ విజయం సాధించడంతో అభిమానులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు బుధవారం పట్టణంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. తొలుత పట్టణానికి సమీపంలోని పీఆర్ ఫంక్షన్ హాల్లో కందికుంటను కలిసి సన్మానించి, అభినందనలు తెలిపారు. అనంతరం వేలాదిమందితో ర్యాలీ ప్రారంభమైంది. ర్యాలీ పీఆర్ ఫంక్షన్‌హాల్ నుంచి నానా దర్గా, జీవిమాను సర్కిల్, వలీసాబ్‌రోడ్డు, రాయలసీమ సర్కిల్, హిందూపురం సర్కిల్ మీదుగా కందికుంట నివాసం వరకు సాగింది. అడుగడుగునా ర్యాలీలో అభిమానులు కందికుంటకు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. కందికుంట ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో నియోజకవర్గ ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి ఆనందంలో మునిగి తేలారు.

లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న కందికుంట

పట్టణంలోని ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామిని కందికుంట దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అర్చకులు ఘన స్వాగతంపలికారు. అనంతరం స్వామి, అమ్మవార్ల దర్శనం చేయించి ప్రత్యేకపూజలు చేయించారు. తరువాత తీర్థ ప్రసాదాలతోపాటు స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు.

గ్రామాల్లో విజయోత్సవాలు

గాండ్లపెంట: ఎమ్మెల్యేగా కందికుంట వెంకటప్రసాద్ విజయం సాధించడంతో మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరిపారు. మండలకేంద్రంతో పాటు మల్లమీదపల్లి, గాండ్లపెంట, జీన్లకుంట, చామలగొంది, కటారుపల్లి తదితర గ్రామాల్లో పెద్దఎత్తున బాణసంచా కాల్చి కేక్‌లు కట్ చేశారు. తర్వాత పలువురు నాయకులు కదిరికి వెళ్లి కందికుంట కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

తనకల్లు: మండలంలోని పెద్దపల్లి, నడిమికుంటపల్లి, కొత్తకురవపల్లి, నక్కరాళ్లతండా, ఎర్రగుట్టపల్లి, ఎర్రబల్లి, బాబేనాయక్‌తండా గ్రామాల్లో కూటమి శ్రేణులు విజయోత్సవ సంబరాలను, ర్యాలీలను ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలతో పాటు ప్రజలు పెద్దఎత్తున ర్యాలీల్లో పాలు పంచుకున్నారు. కేక్‌లు కట్ చేశారు. కొత్తకురవపల్లి గ్రామంలో కర్ణాటకకు చెందిన బీజేపీ నాయకుడు డాక్టర్ ముక్తియార్ బాషాను ఘనంగా సన్మానించారు.

నల్లచెరువు: ఎమ్మెల్యేగా గెలుపొందిన కందికుంట వెంకటప్రసాద్‌ను అభినందించడానికి బుధవారం మండలనుంచి అధిక సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. వారు కదిరి పట్టణంలో కందికుంటను కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో కేక్‌లు కట్ చేశారు. దామావాండ్లపల్లిలో గ్రామదేవతలకు మొక్కులు తీర్చుకున్నారు.


గాండ్లపెంట మండలం రెక్కమానులో కేక్ కట్ చేస్తున్న శ్రేణులు


కదిరిలో కందికుంటను అభినందిస్తున్న నల్లచెరువు మండల నాయకులు

పుట్టపర్తి ప్రజలకు రుణపడి ఉంటా

● ఆధ్యాత్మిక కేంద్రంలో అభివృద్ధికి పెద్దపీట
● ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి


ఆర్జే రత్నాకర్‌తో పల్లె సింధూర దంపతులు, మాజీమంత్రి పల్లె

పుట్టపర్తి / పుట్టపర్తి రూరల్, జూన్ 5: మీఇంటి ఆడబిడ్డగా ఆదరించి ఎమ్మెల్యేగా గెలిపించిన పుట్టపర్తి నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానంటూ ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పేర్కొన్నారు. విజయం సాధించిన సందర్భంగా బుధవారం ఆమె తన భర్త పల్లె వెంకటక్రిష్ణకిశోర్‌రెడ్డి, మామ మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డితో కలిసి పట్టణంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత మాట్లాడుతూ నియోజకవర్గంలో తొలిమహిళా ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడమే తన లక్ష్యమన్నారు. ఎమ్మెల్యే హోదాను పక్కనపెట్టి ప్రజలకు సేవకురాలిగా పనిచేస్తానన్నారు. ప్రతి టీడీపీ కార్యకర్తను తమ కుటుంబసభ్యులుగా భావించి అండగా ఉంటామన్నారు. అనంతరం స్థానిక సత్యమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు జరిపించారు. తర్వాత సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పుట్టపర్తికి తొలి మహిళా ఎమ్మెల్యేగా ఎన్నికైన పల్లె సింధూరను ఆర్జేరత్నాకర్ అభినందించారు.

ఈసందర్భంగా మునుపు టీడీపీ జనసేన బీజేపీ వర్గాలు బారీ సంఖ్యలో తరలివచ్చి శుభాకాంక్షలు తెలియచేశారు. కార్యక్రమంలో సింధూర తల్లిదండ్రులు కేరళ మాజీ డీజీపీ శంకరరెడ్డి దంపతులున్నారు. అంతకు మునుపు పల్లె సింధూరకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలియచేయడానికి పెద్దఎత్తున తరలివచ్చారు.

గ్రామాల్లో శ్రేణుల సంబరాలు

ఓబుళదేవరచెరువు: పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యేగా కూటమి టీడీపీ అభ్యర్థి పల్లె సింధూరా రెడ్డి ఘన విజయం సాధించడం పట్ల గ్రామాల్లో బుధవారం టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు విజయోత్సవ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని నల్లగుట్లపల్లిలో ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో నాయకులు కేక్ కట్ చేశారు. బాణసంచా కాల్చారు. మండలకేంద్రంలోనూ కేక్ కట్ చేసి సంబరాలు చేశారు.

కొత్తచెరువు: మండలంలోని కూటమి శ్రేణులు విజయోత్సవ సంబరాలు చేసుకున్నారు. నాగిరెడ్డిపల్లికి చెందిన టీడీపీ,జనసేన నాయకులు మండలకేంద్రానికి పెద్ద ఎత్తున తరలివచ్చి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండలవ్యాప్తంగా అన్ని గ్రామాల్లోనూ బాణసంచా కాల్చి కేక్‌లు కట్ చేశారు. గ్రామదేవతలకు పూజలు చేసి మొక్కులు చెల్లించారు.

నల్లమాడ: ఎమ్మెల్యేగా విజయం సాగించిన పల్లె సింధూరారెడ్డిని మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు పుట్టపర్తిలో కలిసి పుష్పగుచ్ఛాలందించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మాజీమంత్రి పల్లెను కూడా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మండల కన్వీనర్ మైలే శివశంకర్, నాయకులు బుట్టి నాగభూషణనాయుడు, సలాంఖాన్, రాజారెడ్డి, సర్పంచ్‌ప్రభాకర్‌రెడ్డి, పుట్ల రవీంద్ర, అబ్బాస్‌ఖాన్, మైలే రామచంద్ర, గన్‌రెడ్డి, పద్మనాభరెడ్డి తదితరులు ఉన్నారు. మండలంలోని కొత్తపల్లి ఆంజనేయస్వామికి ఆగ్రామ టీడీపీ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. 101 టెంకాయలు సమర్పించి మొక్కులు చెల్లించారు.


కొత్తచెరువులో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం


ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న కొత్తపల్లి గ్రామ నాయకులు

సత్యకుమార్‌యాదవ్‌కు శుభాకాంక్షల వెల్లువ

● ఆయన నివాసం వద్దకు భారీగా తరలివచ్చిన కూటమి శ్రేణులు


సత్యకుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న చిలకం


సత్యకుమార్‌యాదవ్‌ను శుభాకాంక్షలు తెలపడానికి భారీగా వచ్చిన కూటమి శ్రేణులు

ధర్మవరం, జూన్ 5: ధర్మవరం నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందిన సత్యకుమార్ యాదవ్ ఇంటి వద్ద బుధవారం సందడి నెలకొంది. సత్యకుమార్‌యాదవ్ గెలుపొందడంతో నియోజకవర్గ వ్యాప్తంగా కూటమి శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు భారీ ఎత్తున తరలివచ్చి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జనసేన రాష్ట్రప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి తన కార్యకర్తలు, నాయకులతో కలిసి వచ్చి సత్యకుమార్‌యాదవ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సత్యకుమార్ ఇంటి వద్ద ఉదయం 7గంటల నుంచే కూటమి నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలపడానికి క్యూకట్టారు. అనంతరం ఆయన శివానగర్‌లోని శివాలయంలో శివునికి ప్రత్యేక పూజలు చేయించారు. మధ్యాహ్నం 3గంటలకు హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు.

తాడిమర్రిలో సంబరాలు

తాడిమర్రి: మండలంలో టీడీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. ప్రతి గ్రామంలో నాయకులు ఇష్టదేవతలకు పూజలు నిర్వహించి విందులు ఏర్పాటుచేశారు. పార్టీ విజయం కోసం కష్టపడ్డ కార్యకర్తలకు ప్రత్యేకంగా అభినందలు తెలియజేశారు.


తాడిమర్రిలో సంబరాలు చేసుకుంటున్న టీడీపీ శ్రేణులు

బీజేపీ విజయోత్సవాలు


విజయోత్సవాల్లో బీజేపీ నాయకులు

నంబులపూలకుంట, జూన్ 5: కేంద్రంలో బీజేపీ మూడవసారి అధికారం చేపట్టనుండడంతో పాటు రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రావడంతో మండలకేంద్రంలో బుధవారం బీజేపీ నాయకులు మిఠాయిలు పంచి సంబరాలు జరుపుకున్నారు. మైనార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాబ్‌జాన్‌ను గూటిబైలు గ్రామస్థులు నివాసంలో కలిసి అభినందనలు తెలిపి, సంబరాలు జరుపుకున్నారు.

టీడీపీ వెంటే ముస్లింలు

పుట్టపర్తిరూరల్, పుట్టపర్తి జూన్ 5: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ముస్లింమైనార్టీలు ఎప్పటికీ టీడీపీ వెంటే ఉంటున్నారని ఆపార్టీ రాష్ట్ర ముస్లిం మైనారిటీ విభాగం కార్యదర్శి షేక్ మహమ్మద్‌రఫీ పేర్కొన్నారు. బుదవారం పట్టణంలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం ముస్లింమైనార్టీలకు తీరని ద్రోహం చేసిందన్నారు. తెలుగుదేశంప్రభుత్వం రంజాన్‌తోఫా, హజ్‌యాత్రలకు సాయం, దుల్హన్‌పథకం, మసీదులకు, ఈద్గాల మరమ్మతులకు నిధులను అందించందన్నారు. వైసీపీ ప్రభుత్వం నలభై వేల కోట్ల రూపాయల వక్ఫ్‌బోర్డు ఆస్తులను దక్కకుండా చేసిందన్నారు. టీడీపీ ప్రభుత్వం రూ. కోటీ 25లక్షలతో షాదీఖానా నిర్మిస్తే వైసీపీ ప్రభుత్వం కనీసం బాత్‌రూంలను నిర్మించలేకపోయిందన్నారు. చివరకు కూటమికి వ్యతిరేకంగా ముస్లింలు పనిచేయాలని వైసీపీ కుట్రలు సైతం చేసిందని ఆయన దుయ్యబట్టారు. అందుకే ఆ పార్టీకి ముస్లింలు తగిన బుద్ధి చెప్పారని అన్నారు.

గుర్తుతెలియని శవం లభ్యం

మడకశిర రూరల్, జూన్ 4: మండలంలోని కర్ణాటక సరిహద్దులో ఉన్న గుర్రపుకొండ గ్రామ సమీపంలోని కొండ ప్రాంతంలో బుధవారం గుర్తు తెలియని శవం లభ్యమైనట్లు సీఐ మనోహర్ తెలిపారు. ఈ విషయం తెలిసిన వెంటనే డీఎస్పీ షేక్ బాజీజాన్ సైదా క్లూస్ టీమ్‌తో వెళ్లి తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. మృతి చెందిన యువకుడు 28 వయస్సు ఉంటుందన్నారు. శరీరంపై కాలిన మరకలు ఉన్నాయన్నారు. ఎవరైనా కర్ణాటక ప్రాంతంలో చంపి ఆంధ్ర సరిహద్దులో శవాన్ని పడవేశారా అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మొక్కలు నాటుదాం.. పర్యావరణాన్ని కాపాడుదాం

ఓబుళదేవరచెరువు, జూన్ 5: ప్రతి ఒకరు విరివిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదామని సీఆర్పీలు పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని ఎమ్మార్సీ ఆవరణలో బుధవారం వారు మొక్కలు నాటారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మండల విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టామన్నారు. అనంతరం పర్యావరణాన్ని పరిరక్షిద్దామని, ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధిద్దామని ప్రతిజ్ఞ చేశారు. నరసింహులు, అన్సర్ ఆలీ, సుధాకర్,జయమ్మ తదితరులు పాల్గొన్నారు.


ఓడీసీలో ప్రతిజ్ఞ చేస్తున్న సీఆర్పీలు


మొక్కలు నాటుతున్న రెడ్స్ సంస్థడైరెక్టర్ భానుజా

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కదిరిఅర్బన్: పర్యావరణ పరిరక్షణ అందిరి బాధ్యత అని రెడ్స్ సంస్థ డైరెక్టర్ భానుజా పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ సందర్భంగా మండలంలోని మల్లయ్యగారిపల్లిలో గల రైతుల పొలాల్లో మొక్కలు నాటారు. ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత అన్నారు. గ్లోబులైజేషన్ నేపథ్యంలో వాతావరణంలో సమతుల్యత దెబ్బతింటుందని, అలా జరగకుండా ఉండాలంటే ప్రతి ఒకరు మొక్కలు నాటాలన్నారు. అలాగే పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో రెడ్స్ కోఆర్డినేటర్ యల్లప్ప, మహిళారైతులున్నారు.

అలరించిన గీతం మధురం


పాటలు పాడుతున్న భక్తులు

పుట్టపర్తి జూన్ 5: ఒడిస్సా భక్తులు గీతం మధురం పేరిట చేపట్టిన భక్తి గీతాల ఆలాపన కార్యక్రమం భక్తులను అలరింపజేసింది. ఒడిస్సా భక్తులు పర్తియాత్ర పేరిట బుధవారం ప్రశాంతి నిలయం చేరుకున్నారు. సాయంత్రం సాయికుల్వంత్ సభామండపంలో వాయిద్య గానాన్ని చేపట్టారు. గంటపాటు మధురగానాలతో భక్తులను అలరింపజేశారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

వృద్ధుడిపై దాడి

గోరంట్ల, జూన్ 5: మండలకేంద్రంలో చౌడేశ్వరీ కాలనీకి చెందిన మాజీ వలంటీర్ వరలక్ష్మి భర్త నేసే రాము బుధవారం కంసల రామాంజనేయులు అనే వృద్ధుడిని దాడి చేసి తీవ్రంగా గాయపరి చాడు. ఆంజనేయ స్వామి కాలనీకి చెందిన కంసల రామాంజనేయులుకు వృద్ధాప్య పింఛన్ వస్తోంది. కొంతకాలంగా రామాంజనేయులు, నేసే రాము ఇద్దరు కలిసి మద్యం తాగేవారని బాధితుడి కుమారుడు కంసల బ్రహ్మ తెలిపారు. ఇలా ఉండగా ప్రస్తుతం పింఛన్ల పంపిణీ నేరుగా బ్యాంక్ ఖాతాలో పడుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రామాంజనేయులు, నేసె రాము కలిసి మద్యం తాగుండగా వారిరువు మధ్య వివాదం తలెత్తింది. పింఛన్‌లో తనకు రూ.వెయ్యి ఇవ్వాలని నేసె రాము డిమాండ్ చేయగా, అందుకు వృద్ధుడు నిరాకరించడంతో దాడి చేసినట్లు కంసల బ్రహ్మ తెలిపారు. అంతటితో ఊరుకోక, నేసే రాము ఆంజనేయస్వామి కాలనీలోని వృద్ధుడి ఇంటికి వెళ్ల కట్టెతో తలపె కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన వృద్ధుడిని గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా తలపై ఆరుకుట్లు వేసినట్లు తెలిపారు అనంతరం ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు ఇరు వర్గాలను పిలిపించి విచారణ చేస్తున్నారు.

36వార్డుల్లో కూటమికి మెజారిటీ

● 4వార్డుల్లో మాత్రమే వైసీపీకి మెజారిటీ

ధర్మవరం, జూన్ 5: ధర్మవరం నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2, 45,758 ఓట్లు ఉండగా, ఇందులో 2,18,282 ఓట్లు పోలయ్యాయి. ముఖ్యంగా పట్టణంలో ఎన్డీఏ కూటమికి 52,487 ఓట్లు రాగా వైసీపీకి 35,978 ఓట్లు, కాంగ్రెస్‌కు 2127 ఓట్లు వచ్చాయి. దీంతో కూటమికి మొత్తం 16,509 ఓట్ల మెజారిటీ వచ్చింది. పట్టణంలో 40 వార్డులకు గాను 36 వార్డుల్లో కూటమికే మెజారిటీ రాగా కేవలం 4 వార్డుల్లో మాత్రమే వైసీపీకి దక్కాయి. వార్డుల వారీగా వివరాలు ఇవే.. కూటమికి 1వ వార్డులో (417) ,2వ వార్డులో (898), 3వ వార్డులో(620), 4వ వార్డులో(524), 5వ వార్డులో(297), 6వ వార్డులో(1153), 7వవార్డులో(567), 8వ వార్డులో(497), 9వ వార్డులో(05), 13వ వార్డులో(515), 14వ వార్డులో (389), 15వ వార్డులో(927), 16వ వార్డులో(1140), 17వ వార్డులో(890), 18వవార్డులో(514), 19వవార్డులో(97), 20వవార్డులో(994), 21వ వార్డులో(305), 22వ వార్డులో(497), 23వ వార్డులో(05), 24వ వార్డులో(97), 25వ వార్డులో(227), 27వవార్డులో(70), 28వ వార్డులో (41), 29వ వార్డులో(105), 30వవార్డులో(119), 31వవార్డులో(257), 32వవార్డులో(247), 33వ వార్డులో(76), 34వ వార్డులో(467), 35వవార్డులో(861), 36వ వార్డులో(751), 37వ వార్డులో(295), 38వ వార్డులో(503),39వ వార్డులో(832), 40వ వార్డులో(588) మెజారిటీ రాగా వైసీపీకి 10వవార్డులో(134), 11వవార్డులో(545),12వవార్డులో(450), 26వ వార్డులో 124) మెజారిటీ వచ్చింది.

చేనేత పరిశ్రమను కాపాడండి

ధర్మవరం, జూన్ 5: చేనేత పరిశ్రమను కొత్తప్రభుత్వమైన కాపాడాలని ఏపీ చేనేత కార్మికసంఘం రాష్ట్ర కార్యవర్గసభ్యుడు జింకాచలపతి కోరారు. పట్టణంలోని చేనేత సంఘం కార్యాలయంలో బుధవారం ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. దర్మవరం ఎమ్మెల్యేగా ఎన్నికైన సత్యకుమార్‌యాదవ్‌కు ముందుగా శుభాకాంక్షలు తెలిపారు. ధర్మవరం అంటే చేనేత పరిశ్రమకు పేరుగాంచిందన్నారు. ఈ పరిశ్రమ ఎంతోమందికి ఉపాధి కల్పిస్తోందన్నారు. అయితే ఐదేళ్లలో ఎన్నడూ లేనివిధంగా చేనేత పరిశ్రమ తీవ్ర సంక్షోభంలోకి కూరుకుపోయిందన్నారు. దీనికి కొంతమంది స్వార్థపరులు వారి ఆదాయాన్ని పెంచుకోవడానికి పవర్‌లూమ్స్‌మగ్గాలను చట్ట వ్యతిరేకంగా ఇక్కడికి తీసుకురావడమే కారణమన్నారు. దీనివల్ల చేనేత కార్మికుల ఉపాధిపై దెబ్బ పడిందన్నారు. నిబంధనలు తుంగలోకి తొక్కి విచ్చలవిడిగా ధర్మవరంలో పవర్‌లూమ్స్ మగ్గాలను నడిపిస్తున్నారన్నారు. వీరికి మాజీ ఎమ్మెల్యేకేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అండగా నిలబడ్డారని ఆరోపించారు. కావున కొత్త ప్రభుత్వ మైనా చేనేత పరిశ్రమను కాపాడాలని ఆయన కోరారు. కార్యక్రమంలో చేనేత కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ,జిల్లా కార్యదర్శి వెంకటనారాయణ, గౌరవాధ్యక్షులు వెంకటస్వామి, ఉపాధ్యక్షులు విజయభాస్కర్, నరసింహులు పాల్గొన్నారు.

గుంతలమయంగా కదిరి-రాయచోటి రోడ్డు

● వర్షపు నీటితో నిండి మడుగులను తలపిస్తున్నవైనం
● ప్రయాణించాలంటే జంకుతున్న వాహనదారులు

గాండ్లపెంట, జూన్ 5: మండలకేంద్రంలోని కదిరి, రాయచోటి ప్రధాన రోడ్డులో గుంతలు పెద్దఎత్తున ఉన్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు అవి నీటితో నిండి మడుగులను తలపిస్తున్నాయి. ప్రయాణించాలంటే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్డులో గుంతలన్నీ నిండిపోయాయి. ఆ గుంతల్లో ప్రయాణించాలంటే భయమేస్తోందని, ఏ గుంత ఎంత లోతు ఉందో తెలియడం లేదని వాహనదారులు వాపోతున్నారు. రానున్న రోజుల్లో వర్షాలు అధికంగా పడే అవకాశం ఉందని, అప్పుడు ఈ రోడ్డుపై ఎలా ప్రయాణించాలో తెలియడం లేదని ఆందోళన చెందుతున్నారు. రోడ్డులో గుంతలు పూడ్చాలని పలుమార్లు సంబంధితాధికారులకు విన్నవించామని, ఇంతవరకూ ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు మండిపడుతున్నారు. నిత్యం అనేక వాహనాలు ఈ రోడ్డులో రాకపోకలు సాగిస్తుంటాయంటున్నారు. అలాంటిది ఇన్ని గుంతలు ఉంటే ప్రమాదాలు జరగవా అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని వారు కోరుతున్నారు.


గాండ్లపెంట వద్ద మడుగును తలపిస్తున్న ప్రధాన రహదారి

నీట్‌లో సత్తాచాటిన బత్తలపల్లి విద్యార్థి


సాయి శంతన్ సీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు

బత్తలపల్లి, జూన్ 5: నీట్ ఫలితాలు గత మంగళవారం సాయంత్రం విడుదలయ్యాయి. ఇందులో మండలకేంద్రానికి చెందిన విద్యార్థి సాయి శంతన్ సత్తా చాటాడు. కప్పల రామ్మూర్తి శివకుమారిల కుమారుడు సాయి శంతన్. ఇతను విజయవాడ శ్రీగోశాలైట్స్ మెడికల్ అకాడమీ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. కాగా నీట్ పరీక్ష రాయగా.. 720 మార్కులకు గాను 653మార్కులు సాధించి 26,767వ ర్యాంక్ సాధించాడు. సాయిశంతన్‌ను కుటుంబ సభ్యులు అభినందించారు.

ఓబీసీ కింద 885వ ర్యాంక్


రాంచైతన్యకు స్వీట్ తినిపిస్తున్న కుటుంబసభ్యులు

ధర్మవరం: నీట్ ఫలితాల్లో ధర్మవరం పట్టణానికి చెందిన విద్యార్థి గుర్రం రాం చైతన్య ఓబీసీ కింద 885 ర్యాంకు సాధించాడు. నీట్‌లో 720 మార్కులకు గాను 696 మార్కులు సాధించాడు. దీంతో ఆల్ ఇండియా ఓపెన్‌కేటగిరిలో 2,545వ ర్యాంకు రాగా.. ఓబీసీకింద 885 ర్యాంకు సాధించాడు. విద్యార్థి తండ్రి గుర్రం లక్ష్మీనారాయణ చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారు. ఈ విద్యార్థి ఇంటర్‌లో 978 మార్కులు సాధించాడు. అనంతరం నీట్ పరీక్షలు రాసి ర్యాంకు సాధించాడు. తల్లిదండ్రులు లక్ష్మీనారాయణ, రుక్మిణి రాంచైతన్యను అభినందించారు. రాంచైతన్య మాట్లాడుతూ.. తాను ఎంబీబీఎస్ తరువాత న్యూరోసర్జన్ చేయాలన్నదే ఆశయమని అన్నారు.

హిమజకు 367వ ర్యాంకు


హిమజకు స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు

కొత్తచెరువు: మండలంలోని ఎర్రపల్లి గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు కే.మధుసూదన్‌రెడ్డి కుమార్తె కే.హిమజ నీట్‌లో ఆలిండియా 367వ ర్యాంకు సాధించింది. 720 మార్కులకు గాను 710 మార్కులు సాధించి ర్యాంకు సాధించింది. దీంతో కుటుంబసభ్యులు, గ్రామస్థులు అభినందించారు. ఆ విద్యార్థిని మాట్లాడుతూ తన తాత సత్యనారాయణ రెడ్డి కోరిక మేరకు ఎంబీబీఎస్ చేసి గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు వైద్యసేవలు అందిస్తానని పేర్కొంది.

గణేష్‌నాయక్ ప్రతిభ


కుటుంబ సభ్యులతో గణేష్ నాయక్

ముదిగుబ్బ: మండలకేంద్రానికి చెందిన వెంకటేష్‌నాయక్ కుమారుడు గణేష్‌నాయక్ నీట్ ఫలితాల్లో 720 మార్కులకు గాను 656 మార్కులు సాధించి ఎస్టీ కేటగిరిలో 116వ ర్యాంక్, ఓపెన్ కేటగిరిలో 24,626 ర్యాంక్ సాధించాడు. తండ్రి వెంకటేష్‌నాయక్ పూజారి తండా ప్రాథమిక పాఠశాలలో, తల్లి తులసి రామస్వామి తండా ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్‌లోని మాదాపూర్ నారాయణ కళాశాలలో ఇంటర్ చదివిన గణేష్‌నాయక్ నీట్ ఫలితాల్లో ర్యాంక్ సాధించడంతో బంధువులు అభినందనలు తెలిపారు.

నీట్‌లో సత్తా చాటిన పురం విద్యార్థిని



తల్లిదండ్రులతో ప్రతిభా విద్యార్థిని లాస్య

హిందూపురం అర్బన్, జూన్ 5: నీట్‌లో హిందూపురం విద్యార్థిని సత్తా చాటింది. మంగళవారం వెలువడిన నీట్ ఫలితాల్లో లాస్య ఆలిండియా స్థాయిలో 715 మార్కులు సాధించి 109వ ర్యాంకు సాధించింది. లాస్య తల్లి నేతాజీ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయులుగాను, తండ్రి వెంకట ప్రసాద్ మండల పరిధిలోని చౌళూరు ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుగా పని చేస్తున్నారు. లాస్య పదో తరగతి వరకు హిందూపురం చైతన్య విద్యా సంస్థలో ఇంటర్ విజయవాడలో చదివారు. విద్యార్థినిని ఏపీటీఎఫ్ సభ్యులు అభినందించారు.

గుట్టూరు విద్యార్థిని...



సాయిమహితకు స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు

పెనుకొండ రూరల్, జూన్ 5 : మండలంలోని గుట్టూరుకు చెందిన సాయిమహిత అనే విద్యార్థిని నీట్‌లో ర్యాంక్ సాధించింది. గ్రామానికి చెందిన చెందిన మల్లికార్జున, సుజాత దంపతుల కుమార్తె సాయి మహిత మే 5న విజయవాడలోని డాక్టర్ అకాడమిలో నీట్ పరీక్ష రాసింది. ఈ పరీక్షల్లో సాయిమహిత 1849వ ర్యాంక్ సాధించింది. నీట్‌లో ప్రతిభ కనబరచిన సాయి మహితను తల్లిదండ్రులు అభినందించారు.

గుడిబండలో ఓ మోస్తరు వర్షం

గుడిబండ, జూన్ 5: మండలంలోని ఎస్ రాయాపురం, పూజారిపల్లి, ఎస్ఎస్‌గుండ్లు, మేకలగట్ట, తదితర గ్రామాల్లో బుధవారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. రైతులు తమ పొలాలను దుక్కిదున్నకుని సాగుకు సిద్ధం చేసుకుంటున్నారు. చంద్రబాబు నాయుడు గెలువడంతో సకాలంలో వర్షాలు కురుస్తున్నాయని రైతులు హర్షం వ్యక్తం చేశారు.

గుర్తు తెలియని శవం లభ్యం

మడకశిర రూరల్, జూన్ 4: మండలంలోని కర్ణాటక సరిహద్దులో ఉన్న గుర్రప్పకొండ గ్రామ సమీపంలోని కొండ ప్రాంతంలో బుధవారం గుర్తు తెలియని శవం లభ్యమైనట్లు సీఐ మనోహర్ తెలిపారు. ఈ విషయం తెలిసిన వెంటనే డీఎస్పీ షేక్ బాజీజాన్ సైదా క్లూస్ టీమ్‌తో వెళ్లి తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. మృతి చెందిన యువకుడు 28 వయస్సు ఉంటుందన్నారు. శరీరంపై కాలిన మరకలు ఉన్నాయన్నారు. ఎవరైనా కర్ణాటక ప్రాంతంలో చంపి ఆంధ్ర సరిహద్దులో శవాన్ని పడవేశారా అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వృద్ధుడిపై మాజీ వలంటీర్ భర్త దాడి



దాడిలో గాయపడిన కంసల రామాంజనేయులు

గోరంట్ల, జూన్ 5: మండలకేంద్రంలో చౌడేశ్వరీ కాలనీకి చెందిన మాజీ వలంటీర్ వరలక్ష్మి భర్త నేసే రాము బుధవారం కంసల రామాంజనేయులు అనే వృద్ధుడిని దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. ఆంజనేయస్వామి కాలనీకి చెందిన కంసల రామాంజనేయులు కు వృద్ధాప్య పింఛన్ వస్తోంది. కొంతకాలంగా రామాంజనేయులు, నేసే రాము ఇద్దరు కలిసి మద్యం తాగేవారని బాధితుడి కుమారుడు కంసల బ్రహ్మ తెలిపారు. ఇలా ఉండగా ప్రస్తుతం పించన్ల పంపిణీ నేరుగా బ్యాంక్ ఖాతాలో పడుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రామాంజనేయులు, నేసే రాము కలిసి మద్యం తాగుతుండగా వారిరువురి మధ్య వివాదం తలెత్తింది. పింఛన్‌లో తనకు రూ.వెయ్యి ఇవ్వాలని నేసే రాము డిమాండ్ చేయగా, అందుకు వృద్ధుడు నిరాకరించడంతో దాడి చేసినట్లు కంసల బ్రహ్మ తెలిపారు. అంతటితో ఊరుకోక, నేసే రాము ఆంజనేయస్వామి కాలనీలోని వృద్ధుడి ఇంటికి వెళ్లి కట్టెతో తలపై కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన వృద్ధుడిని గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా డాక్టర్ వినోద్‌కుమార్ చికిత్స చేసి తలపై ఆరుకుట్లు వేసినట్లు తెలిపారు అనంతరం ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు ఇరువర్గాలను పిలిపించి విచారణ చేస్తున్నారు.

కేన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలపై అవగాహన

అనంతపురం టౌన్, జూన్ 5: కేన్సర్ స్ర్కీనింగ్ పరీక్షల నిర్వహణపై వైద్యశాఖ కార్యాలయంలో బుధవారం అవగాహన తరగతులు నిర్వహించారు. ఇందులో డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ. దేవి మాట్లాడుతూ.. ప్రతి పీహెచ్‌సీ పరిధిలో గ్రామాలకు వెళ్లి ప్రత్యేకంగా కేన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు చేపట్టాలని రాష్ట్ర శాఖ నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. అందులో భాగంగా విలేజ్ హెల్త్ క్లినికల స్థాయిలో సీహెచ్‌సీ వైద్యులు, సీహెచ్ఓలు, ఏఎన్ఎంలు ఫ్యామిలీ డాక్టర్ పథకంలో కేన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ పరీక్షలు పక్కాగా నిర్వహించాలనే ఈ శిక్షణ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ రవికుమార్, వైద్యకళాశాల ప్రిన్సిపాల్ మాణిక్యాలరావు, ఆస్పత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కారు బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

శింగనమల, జూన్ 5: శింగనమల తహసీల్దార్ శోభన్‌బాబు కారు బోల్తా పడింది. బుధవారం అనంతపురంలో ఉన్న తహసీల్దార్ తన కారును డ్రైవర్ మైఖేల్‌కు ఇచ్చి శింగనమల తహసీల్దార్ కార్యాలయానికి పని నిమిత్తం పంపాడు. అనంతపురం నుంచి శింగనమలకు ఆ కారు వస్తుండగా... సెంటల్ జైలు సమీపంలోని అనంత విద్యానికేతన్ పాఠశాల వద్ద కారు యాక్సల్ కట్ అయింది. దీంతో కారు డివైడర్‌కు ఢీకొని బోల్తా పడింది. చక్రం కట్ కావడంతో కారు ఎగసిపడింది. కారు డ్రైవర్ మైఖేల్ స్వల్ప గాయలతో బయటపడ్డారు.



మరువపల్లిలో పార్థసారథిని సత్కరిస్తున్న టీడీపీ నాయకులు



సవితను సన్మానిస్తున్న ధనాపురం సూరి తదితరులు

గెలుపొందిన అభ్యర్థులకు అభినందనల వెల్లువ

సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన టీడీపీ అభ్యర్థులకు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో పాటు జనసేన, బీజేపీ నాయకులు బుధవారం అధిక సంఖ్యలో తరలివెళ్లి అభినందనలు తెలిపారు. హిందూపురం పార్లమెంటు అభ్యర్థి బీకే పార్థసారథి, పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత, మడకశిర ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజుకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.. పూలమాలలు, శాలువలతో సత్కరించారు.

పెనుకొండ రూరల్, జూన్ 5 : వైసీపీ ఐదేళ్ల పాలనలో జగన్మోహన్‌రెడ్డి చేసిన అరాచకాలు, ఉద్యోగులపై చిన్నచూపు చూడటం వంటి వాటితో ప్రజలు విసుగు చెందారని హిందూపురం ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి అన్నారు. దీనికి తోడు గతంలో టీడీపీ అధినేత చంద్రబాబు చేసిన అభివృద్ధి, మేలును గుర్తించడంతో టీడీపీ కూటమికి మంచి ఫలితాలు లభించాయన్నారు. ఆయన పట్టణంలోని మడకశిర రహదారిలో ఉన్న టీడీపీ కార్యాలయానికి బీకే బుధవారం వచ్చారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చి ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు బుధవారం రొద్దం మండలంలోని ఆర్ మరువపల్లిలో ఆయన స్వగృహంలో కలిసి పుష్ప గుచ్ఛాలు అందజేశారు. హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గంలోని అన్ని మండలాల నాయకులు, కార్యకర్తలు పూలమాలలువేసి అభినందనలు తెలిపారు. అదేవిధంగా సవిత బుధవారం మండలపరిధిలోని రాంపురంలో ఉన్న తన తండ్రి ఎస్ రామచంద్రారెడ్డి సమాధి వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆమెను ఘనంగా సత్కరించారు.

గోరంట్ల: మండలంలోని మరవపల్లి, రాంపురం గ్రామాల టీడీపీ నాయకులు బుధవారం పెనుకొండకు తరలివెళ్లారు. బీకే పార్థసారథి, సవితను కలిసి పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. శాలువ, పూల మాలతో సత్కరించారు. టీడీపీ మండల కన్వీనర్ సోము శేఖర్, దేవ నరసింహులు, ఉమ్మర్‌ఖాన్, గిరిధర్ గౌడ్, అజంతుల్లా, శీనా, జయరాం, రామమోహన్, రామచంద్ర, చలపతి, గణేష్, వెంకటరెడ్డి, నరేష్‌యాదవ్, సుబ్బరాయుడు, ఉమాశంకర్ తదితరులు ఉన్నారు.

హిందూపురం అర్బన్: పరిగి మండల నాయకులు బుధవారం పెనుకొండలో సవితను కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సూర్యనారాయణ, మాజీ ఎంపీపీ శీగుపల్లి కృష్ణమూర్తి, నాయకులు సోమప్ప, గోపాల్‌రెడ్డి, అశ్వత్థనారాయణప్ప, పాపిరెడ్డి, గోవిందరెడ్డి తదితరులు పేర్కొన్నారు. అదే విధంగా వడ్డెర సాధికార సంఘం రాష్ట్ర నాయకుడు హనుమయ్య తదితరులు బుధవారం సవితను కలిసి పూలమాలతో సత్కరించారు.

చంద్రబాబు చిత్రపటానికి సవిత క్షీరాభిషేకం



చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న సవిత

పెనుకొండ టౌన్, జూన్ 5 : టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు చిత్రపటానికి ఎమ్మెల్యే సవిత క్షీరాభిషేకం చేశారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయానికి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు బుధవారం పెద్దఎత్తున తరలివచ్చి ఆమెకు అభినందనలు తెలిపారు. నియోజక వర్గం నుంచే కాకుండా జిల్లా నలు మూలల నుంచి అభిమానులు, నాయకులు, సన్నిహితులు తరలివచ్చి పుష్పగుచ్ఛాలు, పూలహారాలతో ఆమెను సన్మానించారు. ఈ సందర్భంగా సవిత మాట్లాడుతూ... అందరికీ అందుబాటులో ఉంటూ సేవలందిస్తానని, ఎన్నికల్లో వాగ్దానాలు నెరవేరుస్తానని పేర్కొన్నారు. అనంతరం ఆమె పార్టీ కార్యాలయం నుంచి పెనుకొండ ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహిస్తూ అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కేశవయ్య, చిన్నవెంకటరాముడు, లక్ష్మీనారాయణరెడ్డి, శ్రీనివాసులు, పోతిరెడ్డి, మైనార్టీ నాయకుడు దాదు, బాబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాబయ్య దర్గాలో ప్రార్థనలు

పెనుకొండ టౌన్: సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన సవిత బుధవారం పట్టణంలోని బాబయ్య స్వామి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆమె మైనార్టీ నాయకులతో కలిసి చాదర్(గలఫ్)ను తలపై మోస్తూ దర్గాకు చేరుకున్నారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మైనార్టీలకు టీడీపీ ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. చరిత్రలో ఎన్నడూలేని విధంగా ఈ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీ తనకు ఇచ్చారన్నారు. ఆమె వెంట మాజీ జడ్పీటీసీ నారాయణస్వామి, వెంకటరమణ, దాదు, షౌకత్, షామీర్ తదితర నాయకులు ఉన్నారు.



చాదర్‌ను మోసుకెళ్తున్న ఎమ్మెల్యే సవిత

మడకశిరలో టీడీపీ శ్రేణుల సంబరాలు



గుండుమల తిప్పేస్వామికి శుభాకాంక్షలు తెలుపుతున్న మహిళా కార్యకర్తలు

మడకశిరటౌన్, జూన్ 5: తెలుగుదేశం పార్టీ అభ్యర్థి ఎంఎస్ రాజు విజయం సాధించడంతో నియోజకవర్గం వ్యాప్తంగా తెలుగుతమ్ముళ్లు సంబరాలు చేసుకున్నారు. పట్టణంలోని బాలాజీ నగర్‌లో ఉన్న టీడీపీ కార్యాలయానికి నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు, కార్యకర్తలు బుధవారం పెద్దఎత్తున తరలివచ్చారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామికి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. పూలమాలలతో సత్కరించారు. నాయకులు, కార్యకర్తల సమష్టి కృషితోనే ఉత్కంఠ పోరులో ఎం.ఎస్.రాజు గెలిచారని గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు.

రొళ్ల: మండలంలోని టీడీపీ రాష్ట్ర వక్కలిగ సాధికార కన్వీనర్ వీఎం పాండు రంగప్ప, సీనియర్ నాయకులు సన్నమారేగౌడ్, రవికుమార్, నవీన్, మురళి, శ్రీనివాస్, రంగేగౌడ్ తదితరులు విజయం పొందిన అభ్యర్థులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వారు బుధవారం ఎంపీ అభ్యర్థులు బీకే పార్థసారథి, అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే అభ్యర్థులు ఎంఎస్ రాజు, సవితను, గుండు మల తిప్పేస్వామిని మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. మండలంలోని మల్లినమడుగు, హెచ్‌టీ హళ్లి, రొళ్ల తదితర గ్రామాల్లో కేక్ కట్‌చేసి, బాణసంచా కాల్చారు.

అగళి : రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ కూటమి భారీ విజయం సాధించటంతో మండలంలోని డొక్కలపల్లిలో టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు టపాసులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. టీడీపీ జెండాలు పట్టుకుని జై చంద్రబాబు, జైబాలయ్య అంటూ నినాదాలు చేస్తూ గ్రామం మొత్తం హోరెత్తించారు. నియోజకవర్గంలో ఎంఎస్ రాజు విజయం సాధించడంతో సోషల్ మీడియా ద్వారా అభిమానులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

గుడిబండ: నియోజకవర్గంలో ఎంఎస్ రాజుతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా కూటమి అభ్యర్థులు అత్యధిక స్థానాలు కైవసం చేసుకోవడంతో మండల వ్యాప్తంగా స్వీట్లు పంచుకుని ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, మండల కన్వీనర్ మద్దనకుంటప్ప, నాయకులు దుర్గేష్, లక్ష్మీనరసప్ప, భీమరాజు, ప్రకాశ్, నాగేంద్రప్ప, రామతమన్న, బోజరాజు, నజీర్, వెంకటేశ్, లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ శ్రీనాథ్, జయరాం, పురుషోత్తం, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

'బాబు వచ్చాడు... వర్షాలొచ్చాయ్...'

హిందూపురం అర్బన్, జూన్ 5: చంద్రబాబు వచ్చాడు, రాష్ట్రమంతా విస్తారంగా వర్షాలు వస్తున్నాయని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ ఘన విజయం సాధించడంతో బుధవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఐదేళ్ల రాక్షస పాలన అంతమైందని ఇక ముందున్నది రామరాజ్యమన్నారు. వైసీపీ ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను ఓటు ద్వారా వ్యక్తపరిచారన్నారు. శ్రీకంఠపురంలో 9వ వార్డు కౌన్సిలర్ మంజుల దుర్గా నవీన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. లక్ష్మీపురంలో శ్రీనివాసులు తదితరుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు.

పెనుకొండ రూరల్: సార్వత్రిక ఎన్నికలలో కూటమి అభ్యర్థి సవిత అత్యధిక మెజార్టీతో గెలువడంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. ఆమె బుధవారం మండలపరిధిలోని రాంపురంలో ఉన్న తన తండ్రి ఎస్ రామచంద్రారెడ్డి సమాధి వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆమెను ఘనంగా సత్కరించారు.



శ్రీకంఠపురంలో కేక్ కట్ చేస్తున్న కౌన్సిలర్ మంజుల తదితరులు

నేడు కర్ణాటకలో ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు

పావగడ, జూన్ 5: కర్ణాటక రాష్ట్రంలో ఆగ్నేయ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల లెక్కింపును గురువారం బెంగళూరులోని ఆర్వీ కళాశాలలో నిర్వహించనున్నారు. తుమకూరు, చిత్రదుర్గం, దావణగెర, చిక్కబళ్లాపుర కోలార్ జిల్లాలకు చెందిన 33వేల మంది ఉపాధ్యాయుల్లో 32వేల మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాంగ్రెస్ నుంచి డీటీ శ్రీనివాస్, బీజేపీ తరుపున వైఏ నారాయణస్వామి ఎన్నికల బరిలో ఉన్నారు. ఫలితం సాయంత్రంలోగా వెలువడే అవకాశం ఉంది.

ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం



గోరంట్లలో మొక్కలు నాటుతున్న అంగన్‌వాడీలు

గోరంట్ల, జూన్ 5: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని మండలంలో బుధవారం నిర్వహించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సూపర్‌వైజర్లు నాగరాణి, రజిత అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి పర్యావరణ దినోత్సవాన్ని జరిపారు. సూపర్ వైజర్ రజిత ఆధ్వర్యంలో గోరంట్ల ఎమ్మార్సీలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఖాజాపురంలో సూపర్ వైజర్ నాగరాణి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అంగన్‌వాడీ కేంద్రంలో మొక్కలు నాటారు. సెక్టారు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

అగళి: పర్యావరణాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి సంరక్షించాలని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ జాఫర్ తెలిపారు. అగళి మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటి పర్యావరణ దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

పావగడ : ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని తాలూకాలోని నీలంపల్లిలోని ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, గ్రామ పంచాయతీ పీడీఓలు అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రంథాలయ సిబ్బందితో కలిసి నిర్వహించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటితేనే మానవజాతికి మనుగడ సాధ్యమవుతుందని గ్రామపంచాయతీ పీడీఓ చిన్నయ్య అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యాక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకర్‌నాయక్, బిల్ కలెక్టర్లు బాలు, హనుమంతరాయ, కార్యదర్శి వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఖాజాపురంలో అంగన్‌వాడీ కార్యకర్తల ర్యాలీ



అగళిలో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ జాఫర్



నీలంపల్లిలో మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు

పల్లె నుంచి పట్నం దాకా సైకిల్‌దే హవా

190బూత్‌లలో టీడీపీ, 63బూత్‌లలో వైసీపీ మెజార్టీ

హిందూపురం, జూన్ 5 : గత ఎన్నికల్లో ఎన్నడూలేని విధంగా ఈ సారి ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు పల్లె నుంచి పట్నం దాకా ఓటేశారు. బాలకృష్ణకు వచ్చిన మెజార్టీలో సగం ఓట్లు హిందూపురం పట్నంలోవే. మరోసగం ఓట్లు హిందూపురం రూరల్ మండలం, లేపాక్షి, చిలమత్తూరు మండలాలవి. 2019ఎన్నికల్లో తక్కువ మెజార్టీ వచ్చిన చిలమత్తూరు మండలంలో ఈసారి దాదాపు 3500 వచ్చాయి. నియోజకవర్గ వ్యాప్తంగా 253పోలింగ్ బూత్‌లుండగా 197పోలింగ్ బూత్‌ల లో బాలకృష్ణకు మెజార్టీ వచ్చింది. 63బూత్‌లలో మాత్రమే వైసీపీకి మెజార్టీ. ఇందులో అత్యధికంగా మైనార్టీలున్న వార్డుల్లో వైసీపీకి మెజార్టీ వచ్చింది. ఒక్క రహమత్‌పురం ప్రాంతంలోనే 2600పై చిలుకు ఓట్లు వైసీపీకి మెజార్టీ వచ్చాయి. హిందూపురంలో బాలకృష్ణకు 18వేలకుపైగా మెజార్టీరాగా హిందూపురం రూరల్ మండలంలో 6325, లేపాక్షిలో 4800కుపైగా, చిలమత్తూరులో 3500కుపైగా మెజార్టీ వచ్చింది. బాలకృష్ణకు వచ్చిన మొత్తం మెజార్టీ ఓట్లు 32597కాగా... మండలాలు, పట్టణంలో చెరిసగం పడ్డాయి.

చిలమత్తూరులో తగ్గని సైకిల్ మెజార్టీ

చిలమత్తూరు, జూన్ 5: టీడీపీ ఆవిర్భావం నుంచి హిందూపురం నియోజకవర్గం టీడీపీకి కంచుకోటగా ఉంది. అందులో చిలమత్తూరు మండలం ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. ఇప్పటివరకు జరిగిన ప్రతి సార్వత్రిక ఎన్నికల్లో మండలంలో ఇతర పార్టీలకంటే టీడీపీకి ఎక్కువ మెజార్టీ వస్తోంది. రాష్ట్రంలో ఇతర పార్టీల గాలి వీచినా ఇక్కడ సైకిల్ జోరే ఉండటం విశేషం. అదే జోరు 2024లో జరిగిన ఎన్నికల్లోనూ నడిచింది. మండలంలోని పంచాయతీల వారీగా టీడీపీకి వచ్చిన మెజార్టీ చూస్తే మండల కేంద్రమైన చిలమత్తూరులో 1486, టేకులోడు 115, వీరాపురం 160, సోమఘట్ట 6, పలగలపల్లి 475, చాగలేరు 308, కోడూరు 405, శెట్టిపల్లి 178, దేమకేతేపల్లి 363లుగా వచ్చాయి. మొత్తంగా మండలంలో టీడీపీకి 3496 ఓట్లు మెజార్టీ వచ్చింది.

ప్రతి రౌండ్‌లోనూ ఉత్కంఠ

మడకశిర/మడకశిరటౌన్, జూన్ 5: నియోజకవర్గానికి సంబంధించి మంగళవారం జరిగిన ఎన్నికల కౌంటింగ్ ఉత్కంఠ భరితంగా సాగింది. తొలి రౌండ్ నుంచే వైసీపీ అభ్యర్థి ఈరలక్కప్ప, టీడీపీ అభ్యర్థి ఎంఎస్ రాజు మధ్య విజయం దోబూచులాడింది. మొత్తం 18 రౌండ్లకు గాను.. ప్రతి రౌండ్‌లోనూ ఇరు పార్టీల్లో ఉత్కంఠవాతావరణం నెలకొంది. మొదటి రౌండ్‌లో... చివరి రెండు రౌండ్లలో టీడీపీ అధిక్యం ప్రదర్శించడంతోపాటు పోస్టల్ బ్యాలెట్‌లో స్పష్టమైన ఆధిక్యతతో విజయం ఎంఎస్ రాజు సాధించారు.

రౌండ్	టీడీపీ	వైసీపీ	మెజార్టీ పార్టీ
1	5775	5399	376 (టీడీపీ)
2	4517	5004	487 (వైసీపీ)
3	4032	4027	5 (టీడీపీ)
4	4454	4044	410 (టీడీపీ)
5	5293	4946	347 (టీడీపీ)
6	4478	5033	555 (వైసీపీ)
7	4466	4638	172 (వైసీపీ)
8	4565	4783	218 (వైసీపీ)
9	4901	5350	449 (వైసీపీ)
10	3905	4881	976 (వైసీపీ)
11	4510	4578	68 (వైసీపీ)
12	4783	4877	94 (వైసీపీ)
13	4330	4344	14 (వైసీపీ)
14	5329	4054	1275 (టీడీపీ)
15	4486	3629	857 (టీడీపీ)
16	3166	2995	171 (టీడీపీ)
17	4431	4736	305 (వైసీపీ)
18	926	1004	78 (టీడీపీ)

టీడీపీ అభ్యర్థికి 79,983 ఓట్లు, వైసీపీ అభ్యర్థికి 79,632 ఓట్లు రాగా 351 ఓట్ల మెజార్టీతో టీడీపీ అభ్యర్థి ఎంఎస్ రాజు విజయం సాధించారు.

ప్రజాతీర్పును వక్రీకరిస్తూ... ఆ పత్రికలో రాతలు: ఎంఎస్ రాజు

మడకశిరటౌన్, జూన్ 5: నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేసి ప్రజా తీర్పు మేరకు తాను విజయం సాధిస్తే.... ఈవీఎంలు మార్చి విజయం సాధించారంటూ జగన్ పత్రికలో రాయడం ఆ దొంగ పత్రికకే చెల్లుతుందని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజు మండిపడ్డారు. ఆయన బుధవారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామితో కలిసి పట్టణంలోని బాలాజీనగర్‌లో ఉన్న టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కౌంటింగ్ కేంద్రంలో మంగళవారం ఎన్నికల నిబంధనల మేరకే కౌంటింగ్ నిర్వహించారని, రెండు ఈవీఎంలకు సంబంధించి సమస్య ఉత్పన్నమైందని, వైసీపీ అభ్యర్థి ఈరలక్కప్ప ఆర్‌ఓకు ఫిర్యాదు చేయగా.... జిల్లా కలెక్టర్ సమక్షంలో ఆ ఈవీఎంలకు సంబంధించి వీవీప్యాట్ స్లిప్పులను లెక్కించారని తెలిపారు. అందులో హేమావతి పంచాయతీకి చెందిన ఈవీఎంలో తనకు, పిల్లిగుండ్ల గ్రామానికి చెందిన ఈవీఎంలో వైసీపీ అభ్యర్థికి మెజార్టీ వచ్చిందన్నారు. అందరి సమక్షంలో లెక్కించారన్నారు. అభ్యర్థి, ఏజెంట్లు సంతకాలు పెట్టారన్నారు. అయితే జగన్ సొంత పత్రికలో ఈవీఎంలు మార్చి గెలిచారని వార్తలు రాయడం నీచమైన పని కాదా అని ప్రశ్నించారు. ఇలాంటి అసత్యరాతలు రాయడం సరికాదని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, కార్యనిర్వాహక కార్యదర్శి రాధాకృష్ణ, నాయకులు భక్తర్, గోవిందప్ప, పట్టణ అధ్యక్షుడు మనోహర్, మండల కన్వీనర్లు లక్ష్మీనారాయణ, గణేష్ తదితరులు ఉన్నారు.

'టీడీపీ వెంటే ముస్లిం మైనార్టీలు

పుట్టపర్తిరూరల్, పుట్టపర్తి జూన్ 5: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ముస్లింమైనార్టీలు ఎప్పటికీ టీడీపీ వెంటే ఉంటున్నారని ఆపార్టీ రాష్ట్ర ముస్లింమైనారిటీ విభాగం కార్యదర్శి షేక్ మహమ్మద్‌రఫీ పేర్కొన్నారు. ఆయన బుధవారం పట్టణంలోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ... గత ప్రభుత్వం ముస్లింమైనార్టీలకు తీరని ద్రోహం చేసిందన్నారు. తెలుగుదేశంప్రభుత్వం రంజాన్‌తోఫా, హజ్‌యాత్రలకు సాయం, దుల్హన్‌పథకం, మసీదులకు, ఈద్గాల మరమ్మతులకు నిదులను అందించందన్నారు. వైసీపీ ప్రభుత్వం నలభై వేల కోట్ల రూపాయల వక్ఫ్‌బోర్డు ఆస్తులను దక్కకుండా చేసిందన్నారు. టీడీపీ ప్రభుత్వం కోటీ 25లక్షలతో షాదీఖానా నిర్మిస్తే వైసీపీ ప్రభుత్వం కనీసం బాత్‌రూంలను నిర్మించలేకపోయిందన్నారు.కడకు కూటమికి వ్యతిరేకంగా ముస్లింలు పనిచేయాలని వైసీపీ కుట్రలు సైతం చేసిందన్నారు.

జిల్లా క్రికెట్ మహిళా జట్టు ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్: జిల్లా అండర్-19 క్రికెట్ మహిళా జట్టు ఎంపిక చేసినట్లు అనంత జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి స్థానిక అనంత క్రీడాగ్రామం ఆర్డీటీ స్టేడియంలో బుధవారం తెలిపారు. ఎంపికైన జట్టులో.. అర్షియా, హన్సిరెడ్డి, నందిని, నేహ, అమూల్య, గౌతమి, రిష్య, దీపిక, నాగజ్యోతి, సుమియా, స్రవంతి, అంకాల్‌యాదవ్, సమీనా బేగం, తరుణం, తేజశ్రీతో పాటు స్టాండ్‌బైలుగా హిమవర్షిణి, నిత్యరెడ్డి ఉన్నారు. కోచ్‌గా కుమార్ నియమితులయ్యారు. ఎంపికైన జట్టు శుక్రవారం నుంచి నెల్లూరు జిల్లా వెంకటగిరిలో నిర్వహించే రాష్ట్రస్థాయి మహిళా క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొంటుంది.



జిల్లా అండర్-19 మహిళా క్రికెట్ జట్టు